JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రభాత జయభేరి

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । సోమవారం 04-05-2026
Medchal - Malkajgiri । Monday 04-05-2026

Follow: jayabherinews

సంపుటి : 02 । సంచిక : 337
పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 337 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com


# మహిళలకు పండగే!

- మహిళలకు మోదీ సర్కార్ అదిరిపోయే బంపరాఫర్
- రూ.1 కట్టకుండానే ఇంటికి ఫ్రీగా గ్యాస్ సిలిండర్, ఉజ్వల స్కీమ్‌కు పదేళ్లు!
- ఫ్రీగా గ్యాస్ స్టవ్, సిలిండర్ ఇస్తున్నారని మీకు తెలుసా?



జయభేరి, న్యూఢిల్లీ:

వంటగదుల పొగ నుంచి దేశంలోని మహిళలందరికీ శాశ్వత విముక్తి లభించాలి. వారి ఆరోగ్యానికి, ఆత్మగౌరవానికి ఎల్లప్పుడూ సముచిత స్థానం దక్కాలి. ఇలాంటి గొప్ప సంకల్పంతో మొదలైన ఒక పథకం దేశవ్యాప్తంగా సామాజిక అద్భుతాలు సృష్టిస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో ప్రారంభమైన 'ప్రధానమంత్రి ఉజ్వల యోజన' (PMUY) విజయవంతంగా దశాబ్ద కాలం పూర్తి (2016 మే 1 న ప్రారంభం అయ్యింది)చేసుకుంది. కోట్లాది ఇళ్లలో సరికొత్త వెలుగులు నింపుతూ, పేద కుటుంబాల జీవన ప్రమాణాల్లో ఈ పదేళ్ల సుదీర్ఘ ప్రయాణం ఒక నిజమైన, శాశ్వతమైన మార్పును తీసుకువచ్చింది. గతంలో గ్రామీణ ప్రాంతాల్లోని తల్లులు కట్టెల పొయ్యి ముందు కూర్చుని గంటల తరబడి ప్రమాదకరమైన పొగ పీల్చుకుంటూ తీవ్ర అనారోగ్యాల బారిన పడేవారు. ఆ దుస్థితిని పూర్తిగా మారుస్తూ, ఈ పథకం ద్వారా వారికి కాలుష్య రహితమైన, అత్యంత సురక్షితమైన స్వచ్ఛమైన ఇంధనం అందుబాటులోకి వచ్చింది. వంటగదులు ఇప్పుడు కేవలం అన్నం వండే ప్రదేశాలుగా కాకుండా

...మిగతాది 2 లో




# PMJ జ్యూవెలరీలో భారీ దోపిడీ

- కరీంనగర్‌లో పట్టపగలే కాల్పుల కలకలం..
- కాల్పులతో హడలెత్తించిన ఐదుగురు దొంగలు
- షాపుల్లో సీసీటీవీలు, సెక్యూరిటీ గార్డులు తప్పనిసరి
- అనుమానాస్పద వ్యక్తులను చూస్తే వెంటనే 100కి సమాచారం ఇవ్వండి
- విలువైన నగలు కొనుగోలు చేసేటప్పుడు ఇన్సూరెన్స్ తీసుకోండి
- అంతరాష్ట్ర దొంగల ముఠా పనే: ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

జయభేరి, కరీంనగర్ :

పట్టపగలు కరీంనగర్ జ్యోతినగర్‌లోని ప్రముఖ PMJ జ్యూవెలరీ షాపులో ఐదుగురు దొంగలు ఆయుధాలతో హడలెత్తించారు. సిబ్బందిపై కాల్పులు జరిపి, నలుగురిని గాయపరిచి, భారీగా బంగారు నగలు దోచుకెళ్లారు. పోలీసులు సీసీటీవీ దృశ్యాలతో దర్యాప్తు ముమ్మరం చేశారు. ప్రజలు భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్.. జ్యోతినగర్‌లోని ప్రముఖ PMJ జ్యూవెలరీ షాపులో జరిగిన భారీ దోపిడీ ప్రజలను షాకయ్యేలా చేసింది. తుపాకులతో వచ్చిన ఐదుగురు దొంగలు షాపులోకి చొరబడి, సిబ్బందిపై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో నలుగురు సిబ్బంది గాయపడ్డారు. దొంగలు భారీ మొత్తంలో బంగారు ఆభరణాలను దోచుకుని పరారయ్యారు. PMJ జ్యూవెలరీ మెయిన్ బ్రాంచ్ దగ్గర.. అంటే కోర్టు సర్కిల్ సమీపంలోని శివా థియేటర్ లైన్‌లో ఈ చోరీ జరిగింది. నిజానికి ఆ ప్రాంతం ప్రజలు ఎక్కువగా తిరిగేది. అలాంటి చోట.. ఇంత ధైర్యంగా దోపిడీకి పాల్పడ్డారంటే.. అది మామూలు స్కెచ్ కాదు. అందులోనూ మెయిన్ బ్రాంచ్‌ని టార్గెట్ చేశారంటే.. వారు భారీ దోడిపీ ప్లాన్‌తోనే

...మిగతాది 2 లో

# కౌంటింగ్‌కు సర్వం సిద్ధం




- అందరి దృష్టి ఫలితాలపైనే..

జయభేరి, న్యూఢిల్లీ:

ఇండియా రాజకీయ ముఖచిత్రం తిరగరాసే ఎన్నికలుగా మే 4వ తేదీ నిలువనుందా అనేది మరి కొద్ది గంటల్లోనే తేలనుంది. పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుండటంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ ఎన్నికల ఫలితాలు కేంద్రంలోని బీజేపీ, విపక్ష కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, లెఫ్ట్ పార్టీలకు అత్యంత కీలకం కానున్నాయి. పశ్చిమబెంగాల్‌లో ఈసారి తృణమూల్ కాంగ్రెస్‌కు గట్టి దెబ్బ తగులుతుందని, బీజేపీని విజయం వరించనుందని దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. అయితే ఎగ్జిట్ పోల్స్ అంచనాలను టీఎంసీ కొట్టివేసింది. నాలుగోసారి కూడా తామే అధికారంలోకి వస్తాయమని ధీమా వ్యక్తంచేస్తోంది. టీఎంసీకి ఈ విజయం చాలా కీలకం కానుంది. మమతాబెనర్జీ జాతీయ స్థాయిలో తన స్థానాన్ని పటిష్ఠం చేసుకోవాలన్నా, 2029 లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా కూటమి'కి నేతృత్వం వహించే అవకాశాలు మెరుగుపరచుకోవాలన్నా బెంగాల్‌లో టీఎంసీ గెలుపు అనివార్యం. బెంగాల్‌లోని ఫల్టా అసెంబ్లీ నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో రీపోలింగ్‌కు ఎన్నికల కమిషన్ ఆదేశించడంతో మొత్తం 294 నియోజకవర్గాలకు గాను 293 నియోజకవర్గాల్లో సోమవారం కౌటింగ్ జరుగుతుంది. తమిళనాడులో ఎంకే స్టాలిన్ సారథ్యంలోని డీఎంకే కూటమి ఈసారి కూడా అధికారాన్ని నిలబెట్టుకోనుందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. అన్నాడీఎంకేబీజేపీ కూటమి 'మునక' ఖాయమని, విజయ్ సారథ్యంలోని టీవీంకే గట్టి ఫలితాలను సాధించబోతోందని జోస్యం చెప్పాయి.

# బొమ్మ బ్యాటరీలతో జాగ్రత్త..

- పేలడంతో తెగిపడ్డ బాలుడి చేతి వేళ్లు..
- మెదక్ జిల్లాలో విషాదం



జయభేరి, మెదక్ :

వేసవి సెలవుల్లో సరదాగా ఆడుకుందామని కొనుక్కున్న ఒక చిన్న బ్యాటరీ ఆ బాలుడి జీవితంలో తీరని విషాదాన్ని నింపింది. బొమ్మలో వేసిన బ్యాటరీ అకస్మాత్తుగా పేలడంతో నాలుగో తరగతి చదువుతున్న ఓ బాలుడు తన ఎడమ చేతి మూడు వేళ్లను కోల్పోయాడు. మెదక్ జిల్లా శివంపేట మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకున్న ఈ హృదయవిదారక

...మిగతాది 2 లో

# ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతపై మంత్రి పొంగులేటి కీలక ప్రకటన

- అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ న్యాయం చేయడం ప్రజా ప్రభుత్వ బాధ్యత
- ప్రజా దర్బార్‌లో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్ల కోసమే దరఖాస్తులు
- గత ప్రభుత్వ వైఫల్యం వల్లే పేదలకు ఈ పరిస్థితి ఏర్పడింది
- మే నెలాఖరు నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లను కూడ అందిస్తాం



జయభేరి, ఖమ్మం :

తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడతపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ కీలక ప్రకటన చేశారు. త్వరలోనే రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయనున్నట్టుగా తెలిపారు.

...మిగతాది 2 లో

# నేడు తెలంగాణ కేబినెట్ సమావేశం

- ఉద్యోగుల బకాయిలు, ఆదాయం, నీటి ప్రాజెక్టులపై చర్చ
- కొత్త ఆసరా పింఛన్ల విస్తరణ
- తెలంగాణ ఉద్యమకారుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు
- అభివృద్ధి పనుల సమీక్ష



జయభేరి, హైదరాబాద్:

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండవ సంవత్సరం చివరి దశలోకి అడుగుపెడుతున్న తరుణంలో నేడు (మే 4) మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయంలో కేబినెట్ సమావేశం జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ భేటీలో రాష్ట్ర ఆర్థిక వనరులు, నీటి పారుదల ప్రాజెక్టులు, ఉద్యోగుల సమస్యలు ప్రధాన అజెండాగా ఉన్నాయి. ప్రభుత్వం ఆదాయ లీకేజీలను అరికట్టడం, భూముల విలువల సవరణ, రుణాల పునర్వ్యవస్థీకరణ వంటి అంశాలకు సంబంధించి మంత్రివర్గ ఉపసంఘం నివేదికపై చర్చించనుంది. ఇది రాష్ట్ర అభివృద్ధికి కీలకమని వర్గాలు అంటున్నాయి. రైతులకు సకాలంలో నీరు, ఉద్యోగులకు బకాయిల చెల్లింపు, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం లక్ష్యంగా

...మిగతాది 2 లో




# పవన్ ఆలోచనకు పీవీ సింధు ప్రశంసలు

- పవన్ ఆలోచనల్లో పురుడు పోసుకున్న మ్యాజిక్ డ్రెయిన్స్ పల్లెల్లో మురుగు సమస్య నివారణ
- పవన్ 20 నెలల పాలన గురించి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ సింధు

జయభేరి, విజయవాడ, మే 3 :

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో చేపట్టిన ఓ కార్యక్రమం ప్రశంసలు అందుకుంటోంది. అదే మ్యాజిక్ డ్రెయిన్స్. గ్రామాల్లో మురుగునీటి పారుదల వ్యవస్థ రూపురేఖల్ని మారుస్తుందని భావిస్తున్న ఈ కార్యక్రమంపై పలువురు ప్రముఖులు ఇప్పటికే స్పందిస్తున్నారు. ఇదే క్రమంలో ఒలింపిక్ పతక విజేత, స్టార్ షట్లర్ పీవీ సింధు కూడా స్పందించింది. పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన గ్రామీణాంధ్రప్రదేశ్ లక్ష్య సాధన కోసం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ విప్లవాత్మక ఆలోచనలను అమలు చేస్తున్నారని పీవీ సింధు అభిప్రాయపడ్డారు. పవన్ ఆలోచనల్లో పురుడు పోసుకున్న మ్యాజిక్ డ్రెయిన్స్ పల్లెల్లో మురుగు సమస్య నివారణలో గేమ్ ఛేంజర్ లాంటిదన్నారు. పవన్ 20 నెలల పాలన గురించి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ సింధు ఓ వీడియో విడుదల చేశారు. ఇందులో మ్యాజిక్ డ్రెయిన్స్ లాంటి సరికొత్త విధానాలు అమలు చేయడంపట్ల ఆనందం వ్యక్తం చేశారు.

▶▶ మొదటిపేజీ తరువాయి

## భారీ దోపిడీ

వచ్చినట్లు లెక్క. ఆయుధాలతో జస్ట్ బెదిరించడమే కాదు.. అడ్డుకోవడానికి ప్రయత్నించిన సిబ్బందిపై కాల్పులు కూడా జరిపారు. అంటే.. వాళ్లు ఇలాంటివి చెయ్యడంలో ఆరితేరిన కేటుగాళ్లు అనుకోవచ్చు.

**ఘటన వివరాలు.. ఎలా జరిగింది?:**

సమాచారం ప్రకారం, ఐదుగురు దొంగలు రెండు బైకులపై వచ్చి షాపు లోపలికి చొరబడ్డారు. వారు తుపాకులు చూపి సిబ్బందిని బెదిరించి, కౌంటర్లలో ఉన్న బంగారు ఆభరణాలను తీసుకున్నారు. సిబ్బంది అడ్డుకోవడంతో కాల్పులు జరిపారు. దాంతో నలుగురు సిబ్బందికి గాయాలయ్యాయి. కేటుగాళ్లు పారిపోయాక..గాయపడిన వారిని స్థానికులు సమీప ఆసుపత్రికి తరలించారు. కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. షాపులోని సీసీటీవీ కెమెరాలు ఈ ఘటనను స్పష్టంగా రికార్డ్ చేశాయి. పోలీసులు ఈ ఫుటేజ్‌ను విశ్లేషించి దొంగల గుర్తింపు కోసం గాలింపు చేపట్టారు. దొంగలు బైకులపై పారిపోయినట్లు తెలుస్తోంది. కాబట్టి..వారు ఏ దారిలో పారిపోయారో.. ఆ రూట్లలోని సీసీటీవీ కెమెరాల ఫుటేజ్‌ని చెక్ చేసి, దొంగలను పట్టుకునేలా పోలీసుల ప్లాన్ ఉంది. కరీంనగర్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. "నిందితులను గుర్తించి త్వరగా అరెస్టు చేసి, దోపిడీకి సంబంధించిన ఆభరణాలను వెనక్కి తీసుకురావడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం" అని పోలీసు అధికారులు తెలిపారు. సరౌండింగ్ ఏరియాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఇంతకు ముందు కూడా కరీంనగర్‌లో ఇలాంటి చిన్న చిన్న దోపిడీలు జరిగడంతో ఈ ఘటన భద్రతా వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఈ ఘటన తర్వాత కరీంనగర్‌లోని ఇతర జ్యూవెలరీ షాపులు, వ్యాపారులు టెన్షన్ పడుతున్నారు. ఇలా ఆయుధాలతో వచ్చి, కాల్పులు జరిపే ఘటనలు అరుదు. అలాంటిది.. ఈ ఘటన వ్యాపారుల్లో కలవలం కలిగిస్తోంది. బంగారం కొనుగోలు చేసే సాధారణ మధ్య తరగతి కుటుంబాలకు కూడా ఇది ఆందోళన కలిగించగలదు. ఎందుకంటే.. వారు నగల షాపుకి వెళ్లాలంటే భయపడతారు. తమకు సేఫ్టీ ఉంటుందా అనే ఆందోళన వారిలో ఉంటుంది. "మేము ఏడాది పొదుపు చేసి నగలు కొంటాం. ఇలాంటి దోపిడీలు జరిగితే ఎలా సురక్షితంగా ఉంటాం?" అని ఒక స్థానికుడు అన్నారు. తెలంగాణలో గత కొన్ని నెలల్లో జ్యూవెలరీ షాపులపై దాడులు పెరిగాయి. హైదరాబాద్, వరంగల్ వంటి ప్రాంతాల్లో కూడా ఇలాంటి సంఘటనలు నమోదయ్యాయి. ఇది ఆర్గనైజ్డ్ క్రైమ్ నెట్‌వర్క్‌లకు సంకేతం కావచ్చు. పోలీసు శాఖ ఇంటెలిజెన్స్‌ను మెరుగుపరచాల్సిన అవసరం ఉంది.

**అంతరాష్ట్ర దొంగల ముఠా పనే: ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి**

కరీంనగర్ పీఎంజే బంగారం షాపులో దొంగతనానికి పాల్పడింది అంతరాష్ట్ర దొంగల ముఠా పనేనని మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. దొంగలు ఎవరూ మాస్క్‌లు పెట్టుకోలేదని, వారి ముఖాలను ఐడెంటీఫై చేశామని పేర్కొన్నారు. కేసుకు సంబంధించి దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు. దొంగల్లో ఒకరు తెలుగులో మాట్లాడితే, మరొకరు హిందీలో మాట్లాడారని తెలిపారు. ఈ తరహా ఘటన తాజాగా చందానగర్‌లో జరిగిందని చెప్పారు. కరీంనగర్ పీఎంజే బంగారం షాపులో దోపిడీ కేసుకు సంబంధించి సీసీటీవీ ఫుటేజ్ క్లూస్ టీమ్స్ ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తున్నామని తెలిపారు. కిలో వరకు బంగారు ఆభరణాలు దొంగిలించినట్లు సిబ్బంది చెబుతున్నారని, ఎంత బంగారం పోయింది అనేది లెక్కలు తేలిన తర్వాత వివరిస్తామన్నారు. దొంగలు వాహనాలు మార్చుతూ పారిపోతున్నారని పేర్కొన్నారు. దొంగల కోసం 12 దర్యాప్తు బృందాలతో గాలిస్తున్నామని తెలిపారు. ఐదుగురు నిందితులు దోపిడీకి పాల్పడ్డారని పేర్కొన్నారు. నార్త్ ఇండియాకు చెందని గ్యాంగ్‌గా అనుమానిస్తున్నామని తెలిపారు.

## కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

టీఎంకే 20 శాతం ఓట్లు సాధించినా రాజకీయ పునరేకీకరణకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు. దీంతో తమిళనాడు ఎన్నికల ఫలితాలపైనా ఉత్కంఠ కొనసాగుతోంది. కేరళలో ఇటు కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్, పినరయి విజయన్ సారథ్యంలోని ఎల్డీఎఫ్‌కు గెలుపు చాలా కీలకంగా ఉంది. కేరళలో పదేళ్లుగా అధికారానికి నోచుకుని కాంగ్రెస్ ఈసారి గెలుపుపై ధీమాతో ఉంది. ఎగ్జిట్ పోల్స్ సైతం యూడీఎఫ్ గెలుస్తుందని అంచనా వేశాయి. లెఫ్ట్ అధికారంలో ఉన్న ఏకైక రాష్ట్రం కూడా కేరళ కావడంతో ఎల్డీఎఫ్‌కు కూడా గెలుపు కీలకంగా మారింది. అస్సాంలో బీజేపీ గెలుపు నల్లేరు మీద నడకేనని అన్ని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. మూడింట రెండు వంతుల మెజారిటీని బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే గెలుచుకుంటుందని చెప్పాయి. పుదుచ్చేరిలో మార్పేమీ ఉండదని, ఏఐఎన్ఆర్‌సీ సారథ్యంలోని ఎన్డీయే తిరిగి అధికారం నిలబెట్టుకుందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. అయితే తమిళనాడు తరహాలోనే పుదుచ్చేరిలోనూ తమ కూటమి ఆధిపత్యం సాధిస్తుందని కాంగ్రెస్‌డీఎంకే కూటమి ధీమా వ్యక్తం చేస్తోంది.

## పవన్ ఆలోచనకు పీవీ సింధు..

పాలనా వ్యవహారాలు కొత్తే అయినా పవన్ కళ్యాణ్ వినూత్న కార్యక్రమాలతో ప్రజా సమస్యలకు పరిష్కార మార్గాలు అన్వేషిస్తున్నారని ప్రశంసించారు. దేశంలో మెజారిటీ శాతం ప్రజలు గ్రామీణ ప్రాంతాల్లోనే నివసిస్తుంటారని, కానీ గ్రామాల్లో పారిశుధ్యం పెద్ద సవాలుగా ఉంటుందన్నారు. సరైన మురుగు నీటి పారుదల వ్యవస్థ లేక ప్రజలు అపరిశుభ్ర వాతావరణంలో జీవనం సాగిస్తూ ఉంటారన్నారు. ఈ సమస్యకు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు మ్యాజిక్ డ్రైయిన్స్ రూపంలో అద్భుత పరిష్కార మార్గాన్ని కనుగొన్నారని కితాబిచ్చారు. ఇంకుడు గుంతలతో కూడిన డ్రైయిన్లు ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీటిని క్షణాల్లో మాయం చేస్తాయన్నారు. మూడంచెల ఫిల్టర్ బెడ్ల ద్వారా శుద్ధి చేయబడిన నీటిని భూగర్భ జలంగా మార్చేస్తాయని తెలిపారు. మురుగు నీటి నిల్వ, దుర్వాసన తదితర సమస్యలకు మ్యాజిక్ డ్రైయిన్లు చక్కటి పరిష్కార మార్గం అన్నారు. సాధారణ సిమెంట్ డ్రైయిన్ల నిర్మాణంతో పోలిస్తే మ్యాజిక్ డ్రైయిన్లకు 80 శాతం నిర్మాణ వ్యయం కూడా ఆదా అవుతుందన్నారు. దీనిపై పవన్ కార్యాలయం స్పందిస్తూ ఓ ప్రకటన విడుదల చేసింది. సీఎం చంద్రబాబు సహకారంతో నిర్మిస్తున్న ఈ మ్యాజిక్ డ్రైయిన్ల మ్యాజిక్‌పై తన విలువైన అభిప్రాయాన్ని వెలిబుచ్చిన పీవీ సింధుకు ధన్యవాదాలు తెలిపింది.

## బొమ్మ బ్యాటరీలతో జాగ్రత్త..

ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. శివంపేటకు చెందిన మమత, సత్తయ్య దంపతుల కుమారుడు శివతేజ స్థానిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. ప్రస్తుతం పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో శివతేజ రోజంతా ఇంట్లోనే ఉంటున్నాడు. ఆదివారం మధ్యాహ్నం ఆడుకోవడానికి తన వద్ద ఉన్న ఓ బొమ్మ కోసం బ్యాటరీ అవసరమైంది. దీంతో శివతేజ సమీపంలోని ఒక కిరాణా దుకాణానికి వెళ్లి 25 రూపాయలు పెట్టి ఒక రిమోట్ బ్యాటరీని కొనుగోలు చేశాడు. ఇంటికి వచ్చిన తర్వాత ఆ బ్యాటరీని తన బొమ్మలో అమర్చి ఆడుకోవడం ప్రారంభించాడు. ఆ బొమ్మను చేతిలో పట్టుకుని ఆడుకుంటుండగా, ఒక్కసారిగా పెద్ద శబ్దంతో అందులోని బ్యాటరీ పేలిపోయింది.

**వేళ్లు తెగిపడి రక్తసిక్తం**


బ్యాటరీ పేలిన తీవ్రతకు శివతేజ ఎడమ చేతికి తీవ్ర గాయాలయ్యాయి. పేలుడు ధాటికి అతని ఎడమ చేతి మూడు వేళ్లు పూర్తిగా తెగిపడిపోయాయి. బాలుడి ఆర్తనాదాలు విన్న తల్లిదండ్రులు, పొరుగువారు వెంటనే అక్కడికి చేరుకున్నారు. రక్తసిక్తమైన స్థితిలో ఉన్న బాలుడిని చూసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ప్రమాదం జరిగిన వెంటనే కుటుంబ సభ్యులు శివతేజను శివంపేటలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులు, గాయం తీవ్రత ఎక్కువగా ఉండటంతో మెరుగైన చికిత్స అవసరమని సూచించారు. దీంతో బాలుడిని వెంటనే కొంపల్లిలోని మరో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ బాలుడికి శస్త్రచికిత్స అందిస్తున్నారు.

**తల్లిదండ్రులకు హెచ్చరిక**

ఈ ఘటనతో శివంపేటలో విషాద ఛాయలు అలముకున్నాయి. నాణ్యత లేని ఎలక్ట్రానిక్ వస్తువులు, తక్కువ ధరకు లభించే బ్యాటరీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వేసవి సెలవుల్లో పిల్లలు ఇళ్ల వద్దే ఉండి వివిధ రకాల బొమ్మలతో ఆడుకుంటున్నప్పుడు తల్లిదండ్రులు వారిపై ఒక కన్నేసి ఉంచాలని, ప్రమాదకరమైన ఎలక్ట్రానిక్ పరికరాలకు వారిని దూరంగా ఉంచాలని కోరుతున్నారు. రూ. 25 బ్యాటరీ ఒక బాలుడి భవిష్యత్తును ప్రశ్నార్థకం చేయడం అందరినీ కలిచివేస్తోంది.

# ప్రపంచ ఇంధన సంక్షోభాలకు పరిష్కారం విద్యుదీకరణే..

**సాగర్ అదానీ**



మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న భూరాజకీయ ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన మార్కెట్లలో అనిశ్చితిని సృష్టిస్తున్న నేపథ్యంలో, భారతదేశం విద్యుదీకరణను వేగవంతం చేయాలని, దేశీయ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందని అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాగర్ అదానీ అభిప్రాయపడ్డారు. బాహ్య ఇంధన సంక్షోభాలకు భారతదేశం ఇవ్వగల అత్యంత ప్రభావవంతమైన దీర్ఘకాలిక సమాధానం ఇదేనని ఆయన పేర్కొన్నారు. న్యూఢిల్లీలో జరిగిన ఒక అంతర్జాతీయ సదస్సులో మాట్లాడిన సాగర్ అదానీ.. జాతీయ స్థితిస్థాపకతకు ఆధునిక నిర్వచనం ఇంధన లభ్యత, అందుబాటు మరియు సరఫరా భద్రతలతో ముడిపడి ఉందని అన్నారు. ప్రపంచంలోని ఒక ప్రాంతంలో ఏర్పడే అంతరాయాలు రవాణా మార్గాలు, వస్తువుల ధరలు, సరఫరా గొలుసులు, ఆర్థిక స్థిరత్వంపై ఎలా త్వరగా ప్రభావం చూపుతాయో ఇటీవలి అంతర్జాతీయ సంఘర్షణలు మరోసారి నిరూపించాయని ఆయన గుర్తుచేశారు.

దేశాల ముందున్న ప్రశ్న కేవలం ఆర్థికంగా ఎంత వేగంగా వృద్ధి చెందగలమన్నదానికే పరిమితం కాలేదని, ఆకస్మిక అంతరాయాలను ఎంత బలంగా తట్టుకోగలమన్నదేనని సాగర్ అదానీ తెలిపారు. ఈ సవాలు భారతదేశానికి మరింత వర్తిస్తుందని, రాబోయే దశాబ్దాలలో ఆర్థిక వృద్ధి ఆశయాలు, పారిశ్రామిక విస్తరణ, జీవన ప్రమాణాలు పెరగాలంటే నమ్మకమైన ఇంధన సరఫరాలో భారీ పెరుగుదల అవసరమని ఆయన వివరించారు. నీటి భద్రత, ఆహార భద్రత, డిజిటల్ నాయకత్వం వంటి భారతదేశ అభివృద్ధి ప్రాధాన్యతలు ఇంధన లభ్యతతో ముడిపడి ఉన్నాయని సాగర్ అదానీ అన్నారు. నీటి శుద్ధి, పంపింగ్, లవణరహితం చేయడానికి విద్యుత్ కావాలని; సాగునీటి వ్యవస్థలు, ఎరువుల ఉత్పత్తి, కోల్డ్ స్టోరేజ్, లాజిస్టిక్స్‌కు శక్తి అవసరమని ఆయన చెప్పారు. డేటా సెంటర్లు, కృత్రిమ మేధస్సు వ్యవస్థలు, టెలికాం నెట్‌వర్క్‌లు, కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలకు నిరంతర విద్యుత్ అవసరమని, దీంతో డిజిటల్ నాయకత్వం కూడా విద్యుత్‌పై ఆధారపడి ఉంటుందని ఆయన జోడించారు.

భారతదేశ తలసరి ఇంధన వినియోగం అనేక అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల కంటే, ప్రపంచ సగటు కంటే గణనీయంగా తక్కువగా ఉందని ఆయన పరిశీలించారు. దీనివల్ల ఆదాయాలు పెరిగేకొద్దీ, పట్టణీకరణ వేగవంతమయ్యేకొద్దీ, పారిశ్రామిక కార్యకలాపాలు విస్తరించేకొద్దీ భవిష్యత్ డిమాండ్ గణనీయంగా పెరుగుతుందని ఆయన సూచించారు. భారతదేశం 2047 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మారాలనే తన దీర్ఘకాలిక లక్ష్యాన్ని చేరుకోవాలంటే, విద్యుత్ ఉత్పత్తిలో క్రమంగా వృద్ధి చెందడమే కాకుండా, ఇంధన ఉత్పత్తి, పంపిణీ మరియు నిల్వలో నిర్మాణాత్మక పురోగతిని సాధించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. రాబోయే రెండు దశాబ్దాలలో భారతదేశానికి అదనంగా దాదాపు **2,000 గిగావాట్ల** విద్యుత్ సామర్థ్యం అవసరం కావచ్చని, అదే సమయంలో విద్యుత్ సరసమైనదిగా, విస్తృతంగా అందుబాటులో ఉండేదిగా, క్రమంగా పరిశుభ్రమైనదిగా ఉండేలా చూడాలని ఆయన అంచనా వేశారు. ఆచరణాత్మకమైన, సమతుల్యమైన విధానాన్ని ఆయన కోరారు. పునరుత్పాదక ఇంధనం వేగంగా విస్తరిస్తూనే ఉంటుందని, భారతదేశ భవిష్యత్తుకు కేంద్రంగా నిలుస్తుందని సాగర్ అదానీ అన్నారు. అయితే, భూమి పరిమితులు, అంతరాయ సమస్యల కారణంగా పునరుత్పాదక ఇంధనం ఒక్కటే ఈ సవాలును పరిష్కరించలేదని ఆయన జోడించారు. అందువల్ల, సౌర, పవన విద్యుత్‌తో పాటు జలవిద్యుత్, సమర్థవంతమైన థర్మల్ ఉత్పత్తి, అణు విద్యుత్, నిల్వ సాంకేతికతలతో కూడిన విభిన్న విద్యుత్ మిశ్రమాన్ని భారతదేశం అవలంబించాలని ఆయన పేర్కొన్నారు. రవాణా, పరిశ్రమలు, గృహ రంగాలలో పెద్ద ఎత్తున విద్యుదీకరణ చేయడం అనేది దిగుమతి చేసుకున్న శిలాజ ఇంధనాలపై నిర్మాణపరమైన ఆధారపడటాన్ని తగ్గించడానికి భారతదేశానికి అత్యంత విశ్వసనీయ మార్గమని ఆయన నొక్కి చెప్పారు. విద్యుత్ ఉత్పత్తిలో ఎక్కువ స్వావలంబన దేశాన్ని అస్థిర అంతర్జాతీయ చమురు, గ్యాస్ మార్కెట్ల నుండి రక్షిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. భారతదేశ విధాన వాతావరణాన్ని ప్రస్తావిస్తూ, మౌలిక వసతుల సంస్కరణలు, వేగవంతమైన అనుమతులు, మెరుగైన పంపిణీ నెట్‌వర్క్‌లు, పునరుత్పాదక తయారీకి కొనసాగుతున్న మద్దతు దీర్ఘకాలిక పెట్టుబడుల కోసం బలమైన పర్యావరణ వ్యవస్థను రూపొందించడంలో సహాయపడ్డాయని సాగర్ అదానీ అన్నారు. స్థితిస్థాపకతను నిర్మించడానికి విధాన నిరంతరాయత్వం, అమలు ఆధారిత పాలన కీలకమని ఆయన చెప్పారు. పరివర్తనలో అదానీ గ్రూప్ పాత్ర గురించి మాట్లాడుతూ, ఈ సంస్థ వివిక్త ఆస్తుల కంటే సమీకృత మౌలిక వసతుల వ్యవస్థలను సృష్టించడంపై దృష్టి సారిస్తుందని ఆయన తెలిపారు. ఇందులో పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి, ఇంధన నిల్వ, పంపిణీ నెట్‌వర్క్‌లు, హరిత హైడ్రోజన్, లాజిస్టిక్స్, పోర్టులు, విమానాశ్రయాలు మరియు డిజిటల్ మౌలిక వసతులలో పెట్టుబడులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఇంధన పరివర్తన కోసం గ్రూప్ యొక్క **$100 బిలియన్లకు** పైగా నిబద్ధత భారతదేశంలోని అవకాశాల పరిధిని, వేగవంతమైన అమలు చేయవలసిన అవసరాన్ని ప్రతిబింబిస్తుందని కూడా ఆయన చెప్పారు. భారతదేశానికి ఎక్కువ ఇంధనం అవసరమా కాదా అన్నది ఇకపై సమస్య కాదని, అవసరమైన మౌలిక వసతులను ఎంత త్వరగా నిర్మించగలమన్నదే అసలు సమస్య అని సాగర్ అదానీ ముగించారు. భారతదేశం సమృద్ధిగా, సరసమైన, పరిశుభ్రమైన విద్యుత్‌ను పెద్ద ఎత్తున అందించడంలో విజయవంతమైతే, అది 1.4 బిలియన్ల ప్రజల భవిష్యత్తును సురక్షితం చేయడమే కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రధాన స్థిరీకరణ పాత్రను పోషిస్తుందని ఆయన జోడించారు.

## ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతపై..

ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అర్హతే కొలమానం అని, రాజకీయాలకు తావులేదని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలోని కూసుమంచిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన 'ప్రజా దర్బార్'లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి... జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అదనపు కలెక్టర్ శ్రీజ, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పదే పదే తిరిగే అవసరం లేకుండా, అధికారులే నేరుగా ప్రజల వద్దకు వచ్చి అర్జీలు స్వీకరించి వాటిని పరిష్కరించడమే ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లక్ష్యమని చెప్పారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ద్వారా సంక్షేమ పథకాలను, ప్రభుత్వ సేవలను మరింత వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. ప్రజా దర్బార్ కార్యక్రమంలో తీసుకున్న ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కార దిశగా తక్షణ చర్యలు చేపడుతున్నామని చెప్పారు. పాలేరు నియోజకవర్గంలో ప్రతి మండలాన్ని క్లస్టర్లుగా విభజించి నిర్వహిస్తున్న ఈ ప్రజా దర్బార్‌లలో అందిన ప్రతి న్యాయబద్ధమైన దరఖాస్తును రాజకీయ పార్టీలకు అతీతంగా పరిష్కరిస్తామని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ న్యాయం చేయడం ప్రజా ప్రభుత్వ బాధ్యత, ఇందులో ఎలాంటి జాప్యానికి తావులేదని చెప్పారు. ప్రజా దర్బార్‌లో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్ల కోసమే దరఖాస్తులు వస్తున్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు. గత ప్రభుత్వ వైఫల్యం వల్లే పేదలకు ఈ పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ప్రజా ప్రభుత్వం చిత్త శుద్ధితో లబ్దిదారులను ఎంపిక చేసి... వారికి ప్రతి సోమవారం ఇళ్ల నిర్మాణ నిధులను నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తోందని తెలిపారు. ఇప్పటికే మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లలో సింహభాగం పూర్తయిన నేపథ్యంలో... మే నెలాఖరు నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లను కూడ అందిస్తామని చెప్పారు. ప్రతిపక్షాలు ప్రజా ప్రభుత్వ అభివృద్ధి, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల తీరును చూసి కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం మీద అబద్దాలు దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు సంకెళ్లు వేస్తే... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను రాజు చేసిందని మంత్రి పొంగులేటి తెలిపారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను రైతన్నలకు ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ రైతుపక్షపాతి ప్రభుత్వంగా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. వడ్లు, మొక్కజొన్న పంటలను మద్దతు ధరకే కొనుగోలు చేస్తున్నామని... సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ అందిస్తున్నామని తెలిపారు. వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే 25 లక్షల మందికి రుణమాఫీ చేశామని తెలిపారు. రైతు భరోసాను ఎకరానికి 12 వేలకు పెంచి ఇస్తున్నామని చెప్పారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రేపటి నుండి రైతువారోత్సవాలు నిర్వహిస్తున్నామని.. మే 5, 6, 7 తేదీలలో వరంగల్ లో రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతన్నలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## తెలంగాణ కేబినెట్ సమావేశం

ఈ సమావేశం జరుగుతోంది. ఈ సమావేశం ఫలితాలు హైదరాబాద్ నుంచి గ్రామాల వరకు ప్రభావం చూపవచ్చు. ముఖ్యంగా తెలంగాణ రైతాంగం ఎదుర్కొంటున్న నీటి సమస్యలు, ఉద్యోగుల ఆందోళనలు పరిష్కారం వైపు ముందడుగు వేస్తాయని ఆశలు వ్యక్తమవుతున్నాయి.

**కేబినెట్ సమావేశం ముఖ్య అజెండా: ఆదాయ వనరుల పెంపు:**

ఈ సమావేశంలో ఆదాయ వనరుల సమీకరణపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం నివేదికపై ప్రధాన చర్చ జరగనుంది. రాష్ట్రంలో వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, ఇతర ఆస్తుల విలువలను సవరించి పెంచడానికి ఆమోదం లభించే అవకాశం ఉంది. రిజిస్ట్రేషన్ శాఖ ఇప్పటికే ఈ ప్రక్రియను పూర్తి చేసింది. ఈ నెలలోనే లేదా జూన్ 1 నుంచి భూములకు కొత్త విలువలు అమల్లోకి రావచ్చని సాక్షి రిపోర్ట్ చేసింది.

**ప్రజలపై ప్రభావం:**

భూముల విలువల పెంపు వల్ల రిజిస్ట్రేషన్ ఖర్చు పెరగవచ్చు. అయితే రాష్ట్రానికి అదనపు ఆదాయం వచ్చి అభివృద్ధి పనులు వేగం పుంజుకుంటాయి. సాధారణ ప్రజలు, మధ్య తరగతి వారు జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. రుణాల రీస్ట్రక్చరింగ్, ఆదాయ లీకేజీల అరికట్టడం వంటి అంశాలు కూడా చర్చలో ఉన్నాయి. ఇది రాష్ట్ర ఆర్థిక స్థిరత్వానికి దోహదపడుతుంది.

**తుమ్మిడిహెట్టి బ్యారేజ్: రైతుల ఆశలు:**

ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టు కింద తుమ్మిడిహెట్టి దగ్గర 150 మీటర్ల ఎత్తు బ్యారేజ్ నిర్మాణం కీలక అంశం. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీటిని మళ్లించడానికి నాలుగు ప్రత్యామ్నాయ మార్గాలు పరిశీలనలో ఉన్నాయి. మహారాష్ట్ర ముఖ్యమంత్రితో రేవంత్ రెడ్డి చర్చల తర్వాత ఈ అంశం ముందుకు వచ్చిందని ఈటీవీ భారత్ రిపోర్ట్ చేసింది.

**రైతులకు ప్రయోజనాలు:**

అదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో సాగునీరు అందుబాటులోకి వస్తే వ్యవసాయం బలపడుతుంది. పంటలు పెరిగి, ఆదాయం పెరిగి రైతు సంక్షేమం మెరుగుపడుతుంది. అయితే పర్యావరణ, భూస్వాధీనం సమస్యలు ఉంటే పరిష్కరించాలి. కాళేశ్వరం ప్రాజెక్టు సాంకేతిక సమస్యలు, పునరుద్ధరణ కూడా చర్చలో ఉండవచ్చు.

**ఉద్యోగులు-పింఛనర్ల సమస్యలు: బకాయిల చెల్లింపు:**

ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్లకు రూ.14 వేల కోట్ల బకాయిల్లో రూ.8 వేల కోట్లు రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాలి. వీటిని 100 రోజుల్లో క్లియర్ చేసే రోడ్‌మ్యాప్ తయారు చేసే అవకాశం ఉంది. పెండింగ్ DA, క్యాష్‌లెస్ మెడికల్ సౌకర్యాలు కూడా చర్చకు వస్తాయి. ఆర్టీసీ ఉద్యోగుల విలీనం, కొత్త ఆసరా పింఛన్లు, ఇందిరమ్మ బీమా వంటి వాటిపైనా నిర్ణయాలు ఉండొచ్చు. ఇది ఉద్యోగుల మానసిక స్థైర్యాన్ని పెంచి, సేవల నాణ్యత మెరుగుపరుస్తుంది.

**ఇతర కీలక అంశాలు**

కొత్త ఆసరా పింఛన్ల విస్తరణ.. తెలంగాణ ఉద్యమకారుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు.. అభివృద్ధి పనుల సమీక్ష.. మంత్రివర్గ విస్తరణ లేదా పునర్వ్యవస్థీకరణపై ఆసక్తికర చర్చ జరగవచ్చు. ఐతే.. ఇది ప్రస్తుతానికి జరిగే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. నేటి కేబినెట్ సమావేశం తెలంగాణ అభివృద్ధిలో కీలకమైనది. రైతులు, ఉద్యోగులు, తమ సమస్యలు పరిష్కరించి, రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లాలని సామాన్య ప్రజలు ఆశిస్తున్నారు.

## మహిళలకు పండగే!

అత్యంత ఆరోగ్యకరమైన ప్రదేశాలుగా రూపాంతరం చెందాయి. దీనివల్ల వంట చేయడం ఎంతో సులభతరం కావడంతో పాటు, మహిళలు తమ విలువైన సమయాన్ని ఇతర ముఖ్యమైన పనులపై వెచ్చించే చక్కటి వెసులుబాటు కలిగింది. ఈ అద్భుతమైన ప్రయాణం కేవలం ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇవ్వడంతోనే ఆగిపోలేదు, ఇది నేరుగా మహిళల ఆత్మగౌరవానికి సంబంధించిన అత్యంత సున్నితమైన అంశం. కుటుంబ పోషణలో అహర్నిశలు శ్రమిస్తున్న తల్లులకు కన్నీటి కష్టాలు తప్పించి, వారికి సమాజంలో తగిన గుర్తింపు, అపారమైన గౌరవం దక్కేలా చేసింది. ప్రతి పల్లెటూరి ఇంటికి మెరుగైన భవిష్యత్తును అందించే దిశగా ఇది ఒక బలమైన అడుగుగా నిలిచింది. అడవులకు వెళ్లి కట్టెలు ఏరుకొచ్చే కష్టం, కళ్లెంట నీళ్లు తెప్పించే పొగ వల్ల వచ్చే శ్వాసకోశ వ్యాధుల నుంచి మహిళలకు శాశ్వత విముక్తి లభించింది. దేశవ్యాప్తంగా ఎంతో నిశ్శబ్దంగా, కానీ అత్యంత ప్రభావవంతంగా జరిగిన అతిపెద్ద సామాజిక విప్లవం ఈ ఉజ్వల యోజన అని కచ్చితంగా చెప్పవచ్చు. ఇది కోట్లాది మంది సామాన్యుల జీవితాలను అద్భుతంగా తాకింది. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల్లోని మహిళలకు ఆర్థిక స్వయంప్రతిపత్తినిస్తూ, వారి సాధికారతకు పూలబాటలు వేసింది. సమాజంలో అట్టడుగు స్థాయిలో ఉన్న మహిళలు సైతం ఆధునిక వనరులను వినియోగించుకునేలా చేసి, సామాజిక సమానత్వానికి పెద్ద పీట వేసింది. ఈ పదేళ్ల కాలంలో గ్రామాల్లో వచ్చిన సానుకూల మార్పులు దేశ ప్రగతికి పరోక్షంగా ఎంతగానో తోడ్పడుతున్నాయి. ఆరోగ్యకరమైన భారతదేశం కోసం పునాదులను మరింత బలోపేతం చేయడంలో ఈ పదేళ్ల ఉజ్వల యోజన పాత్ర ఎప్పటికీ చిరస్మరణీయం. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే మొత్తం కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది. తద్వారా దేశం నలుదిశలా సుసంపన్నంగా మారుతుంది. పదేళ్ల కిందట నాటిన ఈ మొక్క నేడు మహా వృక్షమై దేశంలోని మారుమూల గ్రామాలకు సైతం తన తీయని ఫలాలను అందిస్తోంది. మోదీ ప్రభుత్వ చిత్తశుద్ధికి, పేద ప్రజల పట్ల వారికి ఉన్న అపారమైన ప్రేమకు ఈ అద్భుత పథకం ఒక సజీవ సాక్ష్యంగా మన చరిత్ర పుటల్లో నిలిచిపోతుంది. 2025 డిసెంబర్ 1 నాటికి ఈ పథకం ద్వారా స్వచ్ఛమైన వంట ఇంధనాన్ని పొందిన లబ్ధిదారుల సంఖ్య ఏకంగా 10.35 కోట్లకు చేరుకోవడం విశేషం. దాదాపు దేశవ్యాప్తంగా ప్రతి ఇంటికీ ఈ కనెక్షన్లు అందించాలనే భారీ లక్ష్యంతో, 202526 ఆర్థిక సంవత్సరంలో అదనంగా మరో 25 లక్షల ఎల్‌పీజీ (LPG) కనెక్షన్ల విడుదలకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అంతేకాకుండా, అర్హత నిర్ణయించే ప్రక్రియను సైతం 'సింగిల్ డిప్రివేషన్ డిక్లరేషన్' ద్వారా మరింత సరళీకృతం చేసింది. తద్వారా ఈ సదుపాయం సామాన్యులకు మరింత వేగంగా చేరువవుతోంది. పేదలకు గ్యాస్ సిలిండర్లను అందుబాటు ధరలో ఉంచడంపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించింది. ఇందులో భాగంగా, ఉజ్వల యోజన లబ్ధిదారులకు 14.2 కిలోల ఎల్‌పీజీ సిలిండర్‌పై ఏకంగా రూ.300 చొప్పున సబ్సిడీని అందిస్తోంది. ఒక ఆర్థిక సంవత్సరంలో గరిష్టంగా తొమ్మిది సిలిండర్ల (రిఫిల్స్) వరకు ఈ రాయితీని పొందే చక్కటి వెసులుబాటును కల్పించింది. ప్రధానమంత్రి ఉజ్వల యోజన (ఉజ్వల 2.0) పథకం కింద అర్హులైన పేద మహిళలకు ఎలాంటి సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సిన అవసరం లేకుండానే కేంద్ర ప్రభుత్వం ఉచిత గ్యాస్ కనెక్షన్ అందిస్తుంది. ఇందులో భాగంగా మొదటి గ్యాస్ సిలిండర్, వంట చేసుకోవడానికి ఒక గ్యాస్ స్టవ్, కనెక్టింగ్ పైపును లబ్ధిదారులకు పూర్తిగా ఫ్రీగానే సమకూరుస్తారు. అంటే మొదటిసారి ఒక్క రూపాయి కూడా సొంతంగా ఖర్చు చేయకుండానే వారికి పూర్తి స్థాయి గ్యాస్ కనెక్షన్ లభిస్తుంది, ఆ తదుపరి వారు తీసుకునే ప్రతి సిలిండర్‌పై ఒక ఆర్థిక సంవత్సరంలో గరిష్టంగా తొమ్మిది సిలిండర్ల వరకు రూ.300 చొప్పున సబ్సిడీని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు.

# 165వ వారోత్సవం విజయవంతం

- ముఖ్య అతిథిగా ఆర్. రవికిరణ్, అంబేద్కర్రైట్, సూపరింటెండెంట్, ఇన్‌కమ్ ట్యాక్స్.



**జయభేరి, లోత్కుంట, మే 3 :**

లోత్కుంట "ఎక్స్" రోడ్, అల్వాల్‌లోని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద జ్ఞానమాల కార్యక్రమం 165వ వారోత్సవం విజయవంతంగా నిర్వహించబడింది. ముఖ్య అతిథిగా ఆర్. రవికిరణ్, అంబేద్కర్రైట్, సూపరింటెండెంట్, ఇన్‌కమ్ ట్యాక్స్. ముఖ్య అతిథి రవికిరణ్ మాట్లాడుతూ, డా. బి.ఆర్. అంబేద్కర్ వారసత్వం, లక్ష్యాన్ని అణగారిన వర్గాల ప్రతి ఇంటికీ తీసుకెళ్లాల్సిన అత్యవసరం ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని కాపాడటం అంటే భారతదేశాన్ని కాపాడటమే అని, డా. అంబేద్కర్ ప్రపంచ ప్రఖ్యాత నేత అని చెప్పారు. "మన బహుజనులు ప్రతిరోజూ మొదటి ముద్ద తినే ముందు బాబాసాహెబ్‌ను గుర్తు చేసుకోవాలి" అని ఆయన అన్నారు. నిన్న లోత్కుంట రిసోర్స్ సెంటర్‌లో డా. బి.ఆర్. అంబేద్కర్ మిషన్ 5వ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం అడ్వైజర్ అనంతరాజ్ మార్గదర్శకత్వంలో జరిగింది.

సమావేశంలో తీసుకున్న ముఖ్య నిర్ణయాలు భారత దేశ స్వాతంత్ర్యం ఎలా సాధించబడింది, రాజ్యాంగ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం. డా. బి.ఆర్. అంబేద్కర్ జీవిత చరిత్ర & రచనలు ప్రజలకు పంపిణీ చేయడం. రిసోర్స్ స్టడీ సెంటర్ ద్వారా ఉచిత కంప్యూటర్ శిక్షణ, నైపుణ్య శిక్షణలు, జాబ్ మేళాలు నిర్వహించి అణగారిన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం. అడ్వైజర్ రమేష్ కమల ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులందరూ కలిసి పని చేసి అబ్బాయిలు, అమ్మాయిల భవిష్యత్తును మెరుగుపరచాలని, వారిని జాతీయ ప్రధాన ప్రవాహంలోకి తీసుకురావాలని, బాబాసాహెబ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అలాగే కమిటీ నిర్వహించిన కార్యక్రమాలను ప్రశంసిస్తూ: తథాగత గౌతమ బుద్ధుడు – ఆసియా జ్యోతి, శాంతి మార్గదర్శి బోధిసత్వ డా. బి.ఆర్. అంబేద్కర్ – అణగారిన వారి మసీహా, భారత కార్మికుల తండ్రి వారికి పుష్పాంజలి, దీపాలంకరణ ద్వారా ఘన నివాళులు అర్పించినందుకు అభినందించారు. అలాగే సికింద్రాబాద్ కాంటోన్మెంట్‌లో ఎస్సీ జనాభా 25% తగ్గిందని గమనించి, జనగణనలో స్వీయ నమోదు (SelfEnumeration) పై అవగాహన కల్పించాలని కమ్యూనిటీ పెద్దలు, నాయకులు, కార్యకర్తలను కోరారు. సరైన జనగణన లేకపోతే మన గుర్తింపు, రిజర్వేషన్ హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. "మీ ఓటు – మీ హక్కు – మీ రిజర్వేషన్ అన్నీ సరైన జనగణనపై ఆధారపడతాయి" అని అన్నారు. మాస్టర్ వైభవ్ జూనియర్ అంబేద్కర్, మేడం కె.ఏ. లక్ష్మి, సి. సురేష్, డా. మురళి, కె.ఆర్. శివలింగం, పురం కన్నయ్య, కె.ఎం. సురేష్, మహేంద్ర, ఓంకార్, గుర్వయ్య తదితర అంబేద్కర్రైట్లు పాల్గొన్నారు.



## శ్రీశ్రీశ్రీ కోటి మైసమ్మ దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ఠ

**జయభేరి, ఉప్పల్ :**

నాగారం గ్రామంలోని ఓల్డ్ విలేజ్‌లో ఉన్న శ్రీశ్రీశ్రీ కోటి మైసమ్మ దేవస్థానంలో నిర్వహించిన ప్రత్యేక విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో దేవాలయాల అభివృద్ధి ద్వారా ఆధ్యాత్మిక వాతావరణం మరింత బలపడుతుందని తెలిపారు. భక్తుల విశ్వాసానికి నిలయంగా ఉన్న మైసమ్మ అమ్మవారి ఆలయం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం, ఆలయ అభివృద్ధి కోసం గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, దేవస్థాన కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నాచారం డివిజన్లో చాలాకాలంగా పనిచేస్తున్న ఎంటమాలజీ సిబ్బందిని కొత్తగా ఏర్పడ్డ కాప్రా సర్కిల్ కు బదిలీ చేయడంపై ఇబ్బందులు పడుతున్న సిబ్బంది ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డిని కలిసి వారి సమస్యను తెలియజేయడమైనది. ఈ సమస్యను జోనల్ కమిషనర్, ఎం ఎం సి కమిషనర్ తో మాట్లాడి బదిలీలను నిలిపివేయించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలియజేసిన ఎంటమాలజీ సిబ్బంది.

# పేదింటి ఆడబిడ్డలకు అండగా నిలుస్తున్న కోన రాజశేఖర్

- ఎమ్మెల్యే జిఎంఆర్ ఆదేశాల మేరకు పుస్తె మెట్టెలు అందజేత
- సేవాస్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనం



**జయభేరి, దేవరకద్ర :**

సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలుస్తూ, ముఖ్యంగా పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లలో తనవంతు సహకారం అందిస్తున్న జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర మేదరి మహేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కోన రాజశేఖర్ దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం మరోసారి తన సేవా స్ఫూర్తిని చాటు కున్నారు. దేవరకద్ర మండలం అడవి అజిలాపూరం గ్రామానికి చెందిన ధనం ఆంజనేయులు యాదవ్, ధనం అంజిలమ్మ దంపతుల చిన్న కూతురు రాధ వివాహం మల్లేష్ యాదవ్ తో సంప్రదాయబద్ధంగా, గ్రామ ప్రజల సమక్షంలో ఘనంగా జరిగింది. కుటుంబ ఆర్థిక పరిస్థితులు పరిమితంగా ఉండటంతో పెళ్లి ఏర్పాట్లలో సహాయం అవసరమని భావించిన వధువు కుటుంబ సభ్యులు కోన రాజశేఖర్ ను సంప్రదించారు. దీంతో వారి ఆర్థిక పరిస్థితులు గమనించిన కోన రాజశేఖర్ దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ ఆదేశం మేరకు వెంటనే స్పందించి శ్రీమతి అంజిలమ్మ, అంజనేయులు దంపతుల కూతురు రాధ కు పుస్తె మెట్టెలు అందజేసి కుటుంబానికి ఆర్థికంగా తోడ్పాటును అందించారు. ఈ సహాయం వధువు కుటుంబానికి ఒక పెద్ద బలం కాగా, పెళ్లి వేడుకను మరింత ఆనందంగా మారడానికి ఆస్కారం ఏర్పడింది. ఇప్పటికే అనేక పేద కుటుంబాల ఆడబిడ్డల పెళ్లిళ్లలో తనవంతు సహాయంగా పుస్తె మెట్టెలు అందజేస్తూ, వారి జీవితాల్లో చిరునవ్వులు పూయిస్తున్న కోన రాజశేఖర్ సేవలను స్థానిక ప్రజలు ఎంతో అభినందిస్తున్నారు. సమాజంలో అవసరమైన వారికి చేయూత నివ్వడం నిజమైన మానవతా విలువ అని ఆయన తన సహకారం ద్వారా నిరూపిస్తున్నారు. "పేదింటి ఆడబిడ్డ నవ్వు మా సంతోషం" అనే భావనతో ఆయన ముందుకు సాగుతున్నారని గ్రామస్తులు తెలిపారు. పెళ్లికూతురు రాధకు వస్తే మెట్లు అందజేసిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజు గౌడ్, గ్రామ అధ్యక్షులు చిన్నయ్య, విష్ణు చారి, అల్లి రాజయ్య, గోవు ఆంజనేయులు, బాలే సాబ్, పందు, నక్క ఆంజనేయులు, సాయిలు, జానంపేట తిరుమలయ్య, జానంపేట రాములు, ఈద శ్రీనివాసులు, రాజేష్, హరిజన శీను, చిన్న నరసింహులు, గ్రామ పెద్దలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులకు ఆశీర్వదించారు. వారి సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమం సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పులకు నాంది పలుకుతాయని, యువతకు స్ఫూర్తిగా నిలుస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు. కోన రాజశేఖర్ సేవలు మరింత విస్తరించి, ఇంకా ఎక్కువ మంది అవసరమైన వారికి చేరాలని గ్రామ ప్రజలు ఆకాంక్షించారు.



## నూతన బోర్ ను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్

- తాగునీటి సరఫరా కోసం చర్యలు - కంఠం శిరీష కృష్ణారెడ్డి

**జయభేరి, శామీర్ పేట్, మే 3:**

మున్సిపాలిటీలో మంచినీటి సమస్య పరిష్కారానికి చెక్ పెట్టనున్నట్లు అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 16వ వార్డు లాల్ గడి మలక్ పేట లో మున్సిపల్ నిధులతో ఏర్పాటు చేసిన నూతన బోర్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించే ఉద్దేశ్యంతో నూతన బోర్ ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పన కోసం అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. రాబోవు రోజుల్లో అన్ని వార్డుల్లో నీటి సరఫరా మెరుగుపర్చేందుకు గాను చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. అయితే తమ వార్డులో నీటి సమస్య పరిష్కారం కోసం బోర్ వేయించినందుకు గాను చైర్మన్ కు ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కన్ రెడ్డి మాలతి మాధవరెడ్డి, 16వ వార్డు కౌన్సిలర్ స్వప్న రాంప్రసాద్ గౌడ్, స్థానిక నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## హయత్‌నగర్‌లో రోడ్డు ప్రమాదం

- మూడు వాహనాలు దెబ్బతినగా, ఒకరికి గాయాలు

**జయభేరి, హయత్‌నగర్:**

ఆదివారం (03 మే 2026) ఉదయం హయత్‌నగర్ బస్ స్టాప్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మూడు వాహనాలు దెబ్బతినగా, ఒక ప్రయాణికుడు గాయపడ్డాడు. ఫిర్యాదు దారుడు తెలిపిన వివరాల ప్రకారం, ఆయన వనస్థలిపురం నుండి ఎంఆర్‌ఓ కార్యాలయం వైపు తన కారులో ప్రయాణిస్తుండగా, హయత్‌నగర్ బస్ స్టాప్ వద్ద ట్రాఫిక్ తీవ్రంగా నిలిచిపోయింది. ఈ సమయంలో ఉదయం సుమారు 10:40 గంటల ప్రాంతంలో, వెనుక నుండి వస్తున్న 'పల్లె వెలుగు' బస్సు (TS05UC0857) ఆయన కారును ఢీకొట్టింది. అయితే, ఈ ప్రమాదానికి ప్రధాన కారణం ఆ బస్సు వెనుక వస్తున్న మరో ఎలక్ట్రిక్ బస్సు (TG10T5661) అత్యంత వేగంగా, నిర్లక్ష్యంగా నడపడం అని తెలుస్తోంది. ఆ ఎలక్ట్రిక్ బస్సు ముందున్న 'పల్లె వెలుగు' బస్సును ఢీకొట్టడంతో, వరుసగా వాహనాలు ఒకదానితో ఒకటి ఢీకొన్నాయి. దీంతో ఫిర్యాదుదారుని కారు ముందున్న మరో కారును (TS30G5482) ఢీకొట్టింది. ఈ ఘటనలో ఫిర్యాదుదారుని కారుకు వెనుక భాగం మరియు బానెట్ తీవ్రంగా దెబ్బతిన్నాయి. అలాగే 'పల్లె వెలుగు' బస్సులో ప్రయాణిస్తున్న ఒక ప్రయాణికుడికి రక్తస్రావం అయ్యేంత గాయాలు తగిలినట్లు సమాచారం. ఈ ఘటనపై బాధితుడు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. ఈ ప్రమాదంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# వ్యవసాయంలో నూతన పంథాను అవలంబిస్తున్న ఆదర్శ రైతు

- గొట్టిముక్కల కొర్ర తండా రైతు కొర్ర మంగ్త నాయక్ ఆదర్శం



**జయభేరి, దేవరకొండ :**

నల్గొండ జిల్లా దేవరకొండ మండలంలోని గొట్టిముక్కల కొర్ర తండాకు చెందిన రైతు కొర్ర మంగ్త నాయక్, వ్యవసాయంలో నూతన పంథాను అవలంబిస్తూ స్థానిక రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. సంప్రదాయ సాగు పద్ధతులను పాటిస్తూ, ప్రతి సంవత్సరం కొత్త రకాల విత్తనాలను ప్రయోగాత్మకంగా సాగు చేయడం ద్వారా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. మంగ్త నాయక్ ముఖ్యంగా మధిర వ్యవసాయ పరిశోధన కేంద్రం నుండి నాణ్యమైన బ్రీడర్ సీడ్ అయిన MGG-385 రకం పేసర్లను తెచ్చి తన పొలంలో విజయవంతంగా పండిస్తున్నారు.

ఈ రకం పంట సుమారు 75 రోజుల కాల పరిమితిలో సిద్ధమవుతూ, ఒక ఎకరానికి సుమారు 9 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి ఇస్తుందని వ్యవసాయ అధికారులు తెలిపారు. ప్రతి ఏడాది కొత్త రకాన్ని ఎంపిక చేసుకుని, దానిని సమర్థవంతంగా సాగు చేయడం ద్వారా దిగుబడిని పెంచడమే కాకుండా, గ్రామంలోని ఇతర రైతులకు మార్గదర్శకంగా నిలుస్తున్నారు. వ్యవసాయంలో మార్పు అవసరాన్ని ఆయన తన ఆచరణ ద్వారా చాటి చెబుతున్నారు.

అనిశ్చిత వాతావరణ పరిస్థితులు, పెరుగుతున్న సాగు ఖర్చులు వంటి సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ, కొత్త సాంకేతికతలు మరియు మెరుగైన విత్తనాల వినియోగంపై దృష్టి సారించడం మంగ్త నాయక్ ప్రత్యేకత. ఈ క్రమంలో ఏవో రవి సహకారం ఆయనకు ఎంతో ఉపయోగపడుతోంది. విత్తనాల ఎంపిక నుండి సాగు విధానాల వరకు రవి అందిస్తున్న మార్గదర్శకత్వం ఆయన విజయానికి బలంగా నిలుస్తోంది.

మంగ్త నాయక్ కృషి ఫలితంగా, ఆయన పొలం ప్రస్తుతం చుట్టుపక్కల రైతులకు ప్రేరణగా మారింది. కొత్త విత్తనాలపై ఆసక్తి పెంచుకుంటూ, రైతులు కూడా ఆధునిక పద్ధతుల వైపు అడుగులు వేస్తున్నారు. వ్యవసాయంలో నూతన ఆలోచనలు, సాంకేతికతల వినియోగం, ధైర్యంగా ముందుకు సాగే తత్వం ఉంటే మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని కొర్ర మంగ్త నాయక్ విజయగాథ స్పష్టంగా తెలియజేస్తోంది.

## వడదెబ్బపై అవగాహన శిబిరం

**జయభేరి, హుజూర్ నగర్ :**

లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని హుజూర్నగర్1 సబ్ సెంటర్, గోవిందాపురంలో వడదెబ్బపై అవగాహన కార్యక్రమాన్ని డాక్టర్ చందన్, హెల్త్ అసిస్టెంట్ కవిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా సుతారి మరియు హమాలి కార్మికులకు వడదెబ్బపై అవగాహన కల్పించి వడదెబ్బ తగలకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజలకు తెలియజేశారు. అలాగే వడదెబ్బ తగిలినప్పుడు తీసుకోవాల్సిన తక్షణ రక్షణ చర్యల గురించి వివరించారు. అదేవిధంగా ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ (ఓఆర్ఎస్) ప్రాముఖ్యతను వివరించారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఉదయం 10 గంటల లోపే పనులు ముగించుకుని ఇంటికే పరిమితం అవ్వాలని, తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే వదులుగా లేత రంగులో ఉండే కాటన్ వస్త్రాలను ధరించి గొడుగు టోపీ లేదా టవల్ లాంటి సాంప్రదాయ దుస్తులను తప్పకుండా ఉపయోగించాలని వివరించారు.

## అంగరంగ వైభవంగా శ్రీ కన్యకా పరమేశ్వరి శివాలయ శంఖు స్థాపన



**జయభేరి, మేడిపల్లి :**

బోడుప్పల్ వాసవి నగర్ చౌరస్తాలో స్థల దాత శోభారాణి వెంకటేష్ గుప్తా ఆధ్వర్యంలో శ్రీ కన్యకా పరమేశ్వరి శివాలయ శంఖు స్థాపన అత్యంత ఘనంగా నిర్వహించడం. పుర ప్రముఖులు. వైశ్య సంఘము. వాసవి క్లబ్ పెద్దలు రా చెరువు చుట్టూ ఉన్న కాలనీల ప్రజలు. మహిళలు. అత్యధికముగా పాల్గొని ఈ కార్యక్రమం దిగ్విజయం చేసినారు ఈ సందర్భంగా శోభా రాణి వెంకటేష్ గుప్తా సంతోషం వ్యక్తం చేస్తూ ఆలయ నిర్మాణంలో కూడా ఇదే విదంగా ప్రతీ ఒక్కరు దైవ సంకల్పంగా భావించిఇతోదికంగా సామూహికంగా ముందుకు సాగాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర జిల్లా వైశ్య పెద్దలను వాసవి క్లబ్ మెంబెర్స్ ని పూజ కార్యక్రమం నిర్వహించిన పూజారులను శోభారాణి వెంకటేష్ గుప్తా దంపతులు, కుటుంబ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఇంతటి ఉదారత సామాజిక సహృదయులు అయిన శోభారాణి దంపతులను సామాజిక కార్యకర్త రా చెరువు పరిరక్షణ సమితి సభ్యులు డా లక్ష్మి వీర మల్లు ఆధ్వర్యంలో అన్ని కాలానిల కుటుంబ సభ్యులు చెంద్ర శేఖర్, సంతోష్, మోహన్, క్రాంతి, గణేష్, రవీందర్ రెడ్డి, వేణు గోపాల్ రెడ్డి, నాగరాజు, రాజ శేఖర్, అంజన్న, నాగ భూషణం, స్వామి, మొదలైన అనేక మంది అత్యంత ఘనంగా సన్మానించుకొని అది దంపతులు చిరకాలం అయిరారోగ్యంతో అష్టైశ్వర్యంతో ఉంటూ మాకు మార్గ దర్శకులుగా ఉండాలని అక్కాక్షించారు.

## జిల్లా స్థాయి అథ్లెటిక్ సెలక్షన్స్ పోటీలు

- రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన పలువురు క్రీడాకారులు



**జయభేరి, శామీర్ పేట్, మే 3:**

హకీంపేట లోని తెలంగాణ క్రీడా పాఠశాలలో జిల్లా స్థాయి అథ్లెటిక్ సెలక్షన్స్ పోటీలు నిర్వహించారు. అండర్ 8 10 12 14 16 18 20 బాలుర అథ్లెటిక్ పోటీలకు ఎంపిక నిర్వహించగా బాలికల విభాగంలో రన్నింగ్, జంపింగ్, త్రో బాల్ పోటీలకు ఎంపిక నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుండి క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కూరపాటి రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని తెలిపారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లల్ని క్రీడల్లో ప్రోత్సహించాలని సూచించారు. ఇక పాఠశాలల్లో కూడా ఉపాధ్యాయులు క్రీడలకు తగిన సమయం వెచ్చించాలని అన్నారు. కాగా ఎంపికైన విద్యార్థులు ఈ నెల 10, 17వ తేదీల్లో జె ఎన్ స్టేడియం అండ్ గార్డియన్ స్కూల్ లో జరిగే పోటీల్లో పాల్గొంటారని, ఆ పోటీల్లో చక్కటి ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని ఆయన వెల్లడించారు . ఈ కార్యక్రమంలో సభ్యులు తిరుమల్ రావు, తేజ, హర్ష, మణికంఠ, సురేందర్, స్పోర్ట్స్ స్కూల్ పేట్ గోపాల్, శ్రీకాంత్, విద్యార్థుల తల్లింద్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి మంగళం పాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 30 నెలలు గడుస్తున్న రూ. 10,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదు
- గతంలో మాదిరిగానే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలు చేయాలి
- నిరుపేద కుటుంబాలకు ఆర్థికంగా దెబ్బతీసేలా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర
- విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ. 10వేల కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలి
- బిఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు బొడ్డుపల్లి కృష్ణ



**జయభేరి, దేవరకొండ :**
ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం మంగళం పడుతుంది అని బిఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. ఆదివారం దేవరకొండ పట్టణంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 30 నెలలు గడుస్తున్న రూ. 10,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదు అని ఆయన అన్నారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థులు కోర్సు పూర్తయినా సర్టిఫికెట్లు లేక 14 లక్షల మంది విద్యార్థుల పడిగాపులు గస్తున్నారు అని ఆయన పేర్కొన్నారు. గతంలో మాదిరిగానే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలు చేయాలి ఆయన ప్రభుత్వాన్ని కోరారు. నిరుపేద కుటుంబాలకు ఆర్థికంగా దెబ్బతీసేలా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర చేస్తుంది అని ఆయన అన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ. 10వేల కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలి అని ఆయన డిమాండ్ చేశారు. విద్యావ్యవస్థను సర్వనాశనం చేస్తున్న అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆయన అన్నారు.రెండున్నర ఏండ్లుగా యువత ఉద్యోగాల కోసం ఎదురు చూస్తుంటే ఈ ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇవ్వలేదు అని ఆయన తెలిపారు.జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి, రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వాలని అని ఆయన డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీ అంటూ ఊరించి ఊరించి దగా డీఎస్సీ అయ్యింది అని ఆయన తెలిపారు.ఖాళీగా ఉన్న SGT, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు మెగా డీఎస్సీ విడుదల చేయాలి అని ఆయన కోరారు.



## చిన్నారితో ఎమ్మెల్యే జిఎంఆర్ సరదా సందడి

**జయభేరి, దేవరకద్ర :**
మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ఆదివారం సరదా సందడి చేశారు. దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని భూత్పూర్ మండలం కొత్తమొల్గలలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే జిఎంఆర్ ఆ పక్కనే ఉన్న చిన్నారిని ఎత్తుకొని సందడి చేశారు. దీంతో ఆ చిన్నారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తపరిచారు. ఈ దృశ్యం అక్కడున్న వారందరినీ ఎంతగానో ఆకట్టుకుంది.

## ఎమ్మెల్యే జిఎంఆర్ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం

- కొత్తకోటలో ఏటీఆర్ కన్వెన్షన్ హాల్లో శిబిరం



**జయభేరి, దేవరకద్ర :**
మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) జన్మదిన వేడుకల సందర్భంగా సోమవారం కొత్తకోటలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక కేటీఆర్ కన్వెన్షన్ హాల్లో ఉదయం 8:30 గంటలకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారు. కావున రక్తదానం చేసేవాళ్లు ఈ కార్యక్రమానికి హాజరై తమ రక్తాన్ని దానం చేసి రక్తం అవసరమయ్యే వారి ప్రాణాలను కాపాడాలని నిర్వాహకులు కోరారు.

## ముచ్చింతలలో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభం

- హాజరైన ఎమ్మెల్యే జిఎంఆర్



**జయభేరి, దేవరకద్ర :**
మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని కౌకుంట్ల మండలం ముచ్చింతలలో ఆదివారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) తమ కుటుంబం తరపున నూతన వస్త్రాలను అందజేశారు. అలాగే ఇందిరమ్మ ఇండ్లను కూడా ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే అక్కడ పలు వివాహాలకు కూడా హాజరై నూతన వధూవరులను ఎమ్మెల్యే జీఎంఆర్ ఆశీర్వదించారు.

## ఎమ్మెల్యే జిఎంఆర్ జన్మదిన వేడుకలను విజయవంతం చేద్దాం

- దేవరకద్ర మండల సోషల్ మీడియా కన్వీనర్ గోవర్ధన్ నాయి



**జయభేరి, దేవరకద్ర :**
మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకుందామని దేవరకద్ర మండల సోషల్ మీడియా కన్వీనర్ గోవర్ధన్ నాయి అన్నారు. ఎమ్మెల్యే జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# ఘనంగా ఐ ఎన్ టీయుసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- ఐఎన్ టియుసి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్వీట్లు, మజ్జిగ పంపిణీ
- కార్మికుల శ్రేయస్సు, వారి అభ్యున్నతే ప్రధాన లక్ష్యం.... మేకల రాజేందర్ రెడ్డి



**కొండమల్లేపల్లి :**
కార్మికుల శ్రేయస్సు వారి అభ్యున్నతే తనకు ముఖ్యమని ఐ ఎన్ టి యూ జిల్లా ఉపాధ్యక్షులు మేకల రాజేందర్ రెడ్డి అన్నారు. ఐ ఎన్ టీ యూ సీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్మిక నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకుల సమక్షంలో ఆదివారం కేక్ కట్ చేశారు స్వీట్లు పంపిణీ చేసి ఘనంగా నిర్వహించారు. కొండమల్లేపల్లి పట్టణంలో కేఎంపి హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రంలో 100 కేజీల పెరుగు అందించి మజ్జిగ పంపిణీ చేశారు.
ఆదివారం కావడంతో 2500 మంది ప్రజలు, కార్మికులు మజ్జిగను తాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తుందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నేను ఎల్లవేళలా ముందుంటానన్నారు.
ఈ సందర్భంగా కేఎంపి హెల్పింగ్ హాండ్స్ నిర్వాహకులు మేకల రాజేందర్ రెడ్డిని ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కొండమల్లేపల్లి ఉపసర్పంచ్ కోడిదల పద్మా వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఊటుకూరు వేమన్ రెడ్డి, ఐ ఎన్ టి యు సీ జిల్లా లీగల్ అడ్వైజర్ దుగ్గె వెంకన్న, ఎలిమినేటి సాయి, ముచ్చర్ల కర్నాకర్, ఏరుకొండ రాము,కూన భానుచందర్, ఐ ఎన్ టి యు సి జిల్లా కార్యదర్శి నారోజు సైదాచారి,బ్రహ్మచారి, కర్ణకంటి జంగాచారి, ఆడేపు శోభన్, యాదగిరి,శ్రీను, వెంకటయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# 114 షాపులకు 10 షాపులు నడుపుతూ.. 500 మంది కుటుంబాల జీవనం

- అభివృద్ధిలో కొత్త షాపులను ప్రకటిస్తే యువతకు ఉపాధి పెరుగుతుంది : యాదగిరిగుట్ట కొండపైన వర్తక సంఘం సభ్యులు




**జయభేరి, యాదగిరిగుట్ట,మే 03 :**
యాదగిరిగుట్ట దేవస్థానం ఏర్పడిన నాటి నుండి భక్తులకు సౌకర్యార్థంగా ఆలయ అభివృద్ధికి తోడ్పడుతూ వ్యాపార దుకాణాలను ఏర్పాటు చేసుకొని లాభనష్టాలు, కష్టసుఖాలకు నిలబడి ఎన్నో ఏళ్లుగా షాపులు నడుపుకుంటూ జీవనోపాధి పొందుతున్న కొండపైన దుకాణదారులను కొంతమంది రాజకీయ లబ్ధి కోసం ప్రత్యక్షంగా, పరోక్షంగా 500 మంది కుటుంబాలు రోడ్డుపై వేయాలని చూస్తున్న విధానాన్ని మానుకోవాలని యాదగిరిగుట్ట కొండపైన వర్తక సంఘం సభ్యులు కోరారు. ఇటీవల షాపులకు టెండర్ వేయాలని రాజకీయ కోణంగా కొంతమంది ఆలోచన చేస్తున్న విధానాన్ని ఖండిస్తూ ఆదివారం వర్తక సంఘం సభ్యులు విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్తక సంఘం సభ్యులు మాట్లాడుతూ కొండపైన 114 షాపులకు ఆలయ అభివృద్ధిలో ప్రస్తుతం 10 షాపులను కొనసాగిస్తూ 114 షాపుల కిరాయిని చెల్లిస్తున్నామని, 114 కుటుంబాలతో పాటు ప్రరోక్షంగా షాపులలో పనిచేసే సుమారు 500 మంది కుటుంబాలకు చెందిన బడుగు బలహీన వర్గాలు తమ జీవనాన్ని కొనసాగిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం నడుస్తున్న 10 షాపులను టెండర్ వేస్తే కార్పొరేట్ చేతులకు వ్యాపార సంస్థలు వెళ్తే 500 మంది కుటుంబాలు రోడ్డుపై పడడమే కాకుండా అధిక ధరలకు అమ్మి భక్తులకు కూడా ఇబ్బందులు కలిగే అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా వ్యాపార సంస్థలను నడుపుతున్న మాకు హిందూ ధర్మ చట్ట ప్రకారం కిరాయిలను శాతం ద్వారా పెంచుతూ రెన్యూవల్ చేస్తున్నారని,ప్రతి దేవస్థానంలో కూడా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలో కూడా ఇదే విధంగా వ్యాపార సంస్థలు కొనసాగుతున్నాయని తెలిపారు. దుకాణాలపైనే ఆధారపడి తమ కుటుంబాల పోషణ, పెళ్లిళ్లు ,చదువులు,అనేక అంశాలు ఉన్నాయి కాబట్టి స్థానికులైన మాకు యథావిధిగా షాపులను రెన్యూవల్ చేయాలని దేవస్థానం,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

# ఘనంగా ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**జయభేరి, యాదగిరిగుట్ట, మే 03 :**
అఖిల భారత యువజన సమైఖ్య (ఏఐవైఎఫ్) 67వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు యాదగిరిగుట్టలో ఘనంగా జరిగాయి. ఆదివారం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోద శ్రీరాములు జెండాను ఆవిష్కరించి మాట్లాడారు.
1959 మే 3న ఏఐవైఎఫ్ ఆవిర్భవించిందని, నాటి నుండి నేటి వరకు యువజన హక్కులు సాధించడంలో నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు అంకితభావంతో ముందుకు సాగుతున్న సంస్థ ఏఐవైఎఫ్ అని, ప్రస్తుతం భారత దేశంలో, తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగం పెరుగుతుందన్నారు.
విద్యారంగంలో ప్రైవేటీకరణ పెరిగిపోయి పేద, మధ్యతరగతి యువతకు ఉన్న అవకాశాలు క్షీణిస్తున్నయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా,వైద్యం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని,భగత్ సింగ్ స్ఫూర్తితో డ్రగ్స్,గంజాయి, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఏఐవైఎఫ్ మాజీ ఉపాధ్యక్షుడు కళ్లెం కృష్ణ,ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేరబోయిన మహేందర్, యాదగిరిగుట్ట మున్సిపల్ 12వ వార్డు కౌన్సిలర్ బబ్బూరి శ్రీధర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు, మండల అధ్యక్ష, కార్యదర్శులు తోటకూరి శేఖర్, కంబాల వెంకటేష్, నేతలు అనంతుల నరసింహ, శెట్టి నరసింహ, కంబాల రాజు, సంఘీ అరవింద్, ముదిగొండ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.



## అచ్చంపేట ఎమ్మెల్యే కుమారుడి వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే జీఎంఆర్

**జయభేరి, దేవరకద్ర :**
హైదరాబాద్ లో ఆదివారం జరిగిన అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ కుమారుడి వివాహానికి మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించారు.

## వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే



**జయభేరి, దేవరకద్ర :**
మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల, భూత్పూర్ మండలాల్లో ఆదివారం జరిగిన పలు వివాహ వేడుకలకు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న అప్జల్

**జయభేరి, శామీర్ పేట్, మే 3:**
అలియాబాద్ చౌరస్తాలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్ లో బిఆర్ఎస్ నాయకులు మల్లేష్ యాదవ్ కుమారుడు నవీన్ యాదవ్ వివాహ మహోత్సవం ఘనంగా జరిగింది. ఉద్యమకారులు, కాంగ్రెస్ నాయకులు అప్జల్ ఖాన్, నూతన వధూవరులను ఆశీర్వదించారు.నూతన దంపతులు కలకాలం సుఖ సంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శంకర్ గౌడ్, వంగ వెంకట్ రెడ్డి, శేఖర్, ప్రభాకర్, వెంకటేష్‌గౌడ్, శివులు, ప్రభాకర్, మ్యకల సత్తయ్య యాదవ్, మల్లేష్ యాదవ్, ఐలెనీ యాదవ్, దర్శన్ యాదవ్, మహేందర్ యాదవ్, వెంకటేష్ యాదవ్, అనిల్ యాదవ్ , సతీష్ యాదవ్, మహేష్ యాదవ్, కార్తీక్ యాదవ్, ఆనంద్ యాదవ్, దాసరి మల్లేష్ యాదవ్, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే



**జయభేరి, దేవరకద్ర :**
మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం గువ్వల గౌరమ్మ కు చెందిన ఇందిరమ్మ ఇంటిని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ఇంటి యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే తమ కుటుంబం తరపున ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# స్వామి వారి నిత్యరాబడి రూ.41.81 లక్షలు

**జయభేరి, యాదగిరిగుట్ట, మే 03 :**



యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయం భక్తజన సందోహమైంది. ఆదివారం సెలవు రోజు కావడంతో స్వామి, అమ్మవార్ల దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుండి తరలివచ్చిన భక్తులతో యాదగిరిగుట్ట కిటకిటలాడింది. శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి కొండపైన, కొండ కింద పలు ప్రాంతాల్లో ఎటు చూసినా భక్తుల రద్దీ కనిపించింది. స్వామి వారి దర్శన క్యూలైన్లు, ప్రసాద విక్రయ కేంద్రాలు, గదుల విచారణ కార్యాలయం,టికెట్ల విక్రయ కేంద్రాలు,పార్కింగ్,బస్టాండ్, పుష్కరిణి,తలనీలాలు సమర్పించే కేంద్రం, శ్రీసత్యనారాయణ వ్రత మండపంతో పాటు పరిసర ప్రాంతాల్లో భక్తులు సందడి చేశారు. అశేషంగా తరలివచ్చిన భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారి ఉచిత దర్శనానికి 5 గంటలకు, సర్వ దర్శనానికి 3 గంటల సమయం పట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

**కొనసాగుతున్న నిత్య పూజలు..**

శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. ఆదివారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలతో పాటు పలు సేవల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**యాదగిరీశుడి నిత్యరాబడి..**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి ఆదివారం వివిధ శాఖల నుంచి భారీగా ఆదాయం వచ్చింది. నిత్యరాబడిలో భాగంగా స్వామి, అమ్మవార్లకు రూ.41,81,364 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.3,13,200, బ్రేక్ దర్శనం ద్వారా రూ.2,79,300,శ్రీసత్యనారాయణ వ్రతాల ద్వారా రూ.2,25,000, రూ.150 వీఐపీ దర్శనం ద్వారా రూ.6,91,500, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.6,72,500, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.89,464, ప్రసాద విక్రయం ద్వారా రూ.13,96,020,కల్యాణ కట్ట ద్వారా రూ.1,40,000తోపాటు వివిధ శాఖలు,పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.







# సమాజ సేవలో భాగస్వాములు కావాలి

**జయభేరి, తుర్కపల్లి, మే 03 :**

యువ కళాకారులు జహంగీర్ మార్గాన్ని అనుసరించి సమాజ సేవలో భాగస్వాములు కావాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. ఆదివారం తుర్కపల్లి మండల కేంద్రంలో సామాజిక ఉద్యమ కళాకారుడు జహంగీర్ సంస్కరణ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జహంగీర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తోటి కళాకారులు రూపొందించిన పాటల సిడిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జహంగీర్ సామాజిక చైతన్యాన్ని కళారూపాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లిన గొప్ప కళాకారుడని కొనియాడారు. సమాజంలో అన్యాయాలు, అసమానతలపై తన కలతో పోరాడిన వ్యక్తిగా ఆయనను గుర్తు చేసుకున్నారు. ఆయన సేవలు ఆలోచనలు ఎల్లప్పుడూ ప్రజలకు మార్గదర్శకాలుగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సోమల వెంకటేశం, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ తొర్రూర్ డిపో అధ్యక్షునిగా ధర్మారపు దర్గయ్య





**జయభేరి, తొర్రూర్, మే03:**

ఆదివారం ఉదయం 10 గంటలకు తొర్రూర్ గెస్ట్ హౌస్ నందు ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగినది . ఈ కమిటీకి ముఖ్యఅతిథిగా వరంగల్ రీజియన్ అధ్యక్షులు గూడెల్లి దేవేందర్ అధ్యక్షతన వహించి తన ఆధ్వర్యంలో ఈ కమిటీని ఎన్నుకోవడం జరిగినది తొర్రూర్ డిపో ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షునిగా ధర్మారపు దర్గయ్య ఇడిసి, ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు, నాకు ఈ అవకాశం ఇచ్చినటువంటి సంఘ రాష్ట్ర జిల్లా బాధితులకు ధన్యవాదాలు తెలియజేశారు సెక్రటరీగా రమణ కండక్టర్ గారిని అదేవిధంగా ట్రెజరీగా కిరణ్ కుమార్ కండక్టర్ ఎన్నుకోవడం జరిగినది.

# ఆధ్యాత్మికతకు అన్నదానలకు పెట్టింది పేరు మన సిద్దిపేట

- **మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**



**జయభేరి, సిద్దిపేట :**

రంగధాంపల్లి శ్రీ పంచవటి హనుమాన్ దేవాలయ అన్న ప్రసాద భవనం ను ప్రారంభించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు. సిద్దిపేట పట్టణం 3 వార్డ్ రంగదాంపల్లి లో శ్రీ పంచవటి హనుమాన్ దేవాలయం ప్రాంగణం లో నిర్మించిన అన్న ప్రసాద భవనంను ప్రారంభించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు. ఈ సందర్భంగా మాట్లాడుతు సిద్దిపేట అన్నదానాలకు పెట్టింది పేరన్నారు ఆధ్యాత్మికతకు అన్నదానలకు నెలవు గా మారిందన్నారు. హనుమాన్ దీక్ష బిక్షకు బీజం వేసింది మన సిద్దిపేటనేన్నారు రావి చెట్టు హనుమాన్ దేవాలయం లో 41రోజులు, గణేష్ నగర్ హనుమాన్ దేవాలయం లో 21రోజులు, పంచముఖ హనుమాన్ దేవాలయం లో 21 రోజులు బిక్ష కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. రావి చెట్టు హనుమాన్ దేవాలయం, గణేష్ నగర్ హనుమాన్ దేవాలయం, నేడు రంగాధంపల్లి లో ప్రారంభం చేసుకున్నం సిద్దిపేట లో చేసిన అన్ని భవనాలకు నా సహకారం అందించానని చెప్పారు.

# గ్యాస్ కోసం బారులు



**జయభేరి, చింతలపూడి :**

చింతలపూడి పట్టణంలో భారత్ గ్యాస్ గోడౌన్ వద్ద గ్యాస్ వినియోగదారులు బారులు తీరారు. టికి డెలివరీ ఇవ్వడం లేదని వినియోగదారుల ఆందోళన.. గ్యాస్ బుక్ చేసుకున్న వారికి ఇంటికి డెలివరీ ఇవ్వకుండా స్థానికంగా ఉన్న వ్యాపారస్తులకు ఇస్తున్నారని వినియోగ దారులు ఆందోళన చేపట్టారు.. స్థానిక రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



# 90 ml ఎంత పని చేసింది?

- **ముంబైలో మోగిన అలారం**
- **కట్ చేస్తే హైదరాబాద్‌లో**

**జయభేరి, హైదరాబాద్ :**

జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. మెట్రో స్టేషన్ కింద అడ్డా కూలీగా పని చేసే ఓ వ్యక్తి, మద్యానికి బానిసై ఏటీఎంను పగలగొట్టేందుకు యత్నించాడు. ఈ ఘటన రోడ్ నంబర్ 5 వద్ద ఉన్న చెక్‌పోస్ట్ సమీపంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం, కొత్తపల్లి వేణునంద అనే వ్యక్తి మద్యం మత్తులో ఏటీఎం వద్దకు వెళ్లి దానిని ధ్వంసం చేయడానికి ప్రయత్నించాడు. అయితే, ఏటీఎంలో అమర్చిన ఆధునిక సెక్యూరిటీ వ్యవస్థ వెంటనే స్పందించి అలర్ట్‌ను ముంబైలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయానికి పంపింది. అక్కడి నుంచి సమాచారం అందుకున్న అధికారులు తక్షణమే స్థానిక పోలీసులను అప్రమత్తం చేశారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు చెప్పిన సమాధానం ఆశ్చర్యానికి గురిచేసింది."90 మిల్లీలీటర్ల మద్యం కోసం 90 రూపాయలు తీసుకోవాలనుకున్నాను" అని చెప్పినట్లు పోలీసులు వెల్లడించారు. అనంతరం అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ ఘటనతో, నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఏటీఎం భద్రతా వ్యవస్థలు ఎంత వేగంగా స్పందిస్తున్నాయో మరోసారి స్పష్టమైంది. చిన్న సమయంలోనే హెడ్‌క్వార్టర్స్‌కు సమాచారం చేరి, స్థానికంగా చర్యలు తీసుకోవడం టెక్నాలజీ సమర్థతకు నిదర్శనంగా నిలిచింది.

# ప్రియుడు ఫోన్ రీచార్జ్ చేయించలేదని మహిళ ఆత్మహత్య



**జయభేరి, హైదరాబాద్ :**

సహజీవనం చేస్తున్న ప్రియుడు ఫోన్ రీచార్జ్ చేయలేదని ప్రియురాలు ఆత్మహత్య చేసుకుంది. కుత్బుల్లాపూర్ పరిధిలోని ప్రశాంత్ నగర్లో కిరణ్మి (26) 2015లో ప్రేమ వివాహం చేసుకుంది. భార్య భర్తల మధ్య గొడవలు జరిగి విడిపోగా, తన కొడుకుతో కొన్ని రోజులు తల్లి దగ్గరే ఉంటోంది. బ్యూటీషియన్ కోర్స్ నేర్చుకొని ఓ ప్రైవేట్ సంస్థలో పని చేస్తూ, వెంకటేష్ అనే వ్యక్తిని ప్రేమించి ఏడాదిగా అతనితో కిరణ్మయి సహజీవనం చేస్తోంది. రెండు రోజుల క్రితం తన ఫోన్ రీచార్జ్ అయిపోయిందని రీచార్జ్ చేయమని అడిగినా ప్రియుడు రీచార్జ్ చేయకపోవడంతో, అతనితో గొడవపడి ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుంది. తన కూతురు మృతిపై వెంకటేష్ మీద అనుమానం వ్యక్తం చేస్తూ కిరణ్మయి తల్లి చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట, మే 03 :**




యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన కోనేరు నాగరాజు ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ఆత్మహత్యకు గల కారణాలు కుటుంబ సభ్యులను అడిగి బీర్ల అయిలయ్య తెలుసుకున్నారు. యాదగిరిగుట్ట కొండపైన దుకాణమే ఆధారంగా జీవనం సాగిస్తున్న కోనేరు నాగరాజు, కొండపైన దుకాణం రద్దు అవుతుందని కొందరు ప్రచారం చేశారని ఆలేరు ఎమ్మెల్యేకు కుటుంబ సభ్యులు తెలిపారు. కొండపైన దుకాణాలు రద్దవుతాయేమోననే ఆందోళనతో తీవ్రమనస్తాపానికి గురైన కొనేరు నాగరాజు ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలపగా అధైర్య పడొద్దని అండగా ఉంటామని ఆలేరు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం అక్కడే ఉన్న కొందరు కొండపైన దుకాణాలు రద్దయితే తమ పరిస్థితి ఏమిటని, తమ ఉపాధి దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేయగా, దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య వారికి హామీ ఇచ్చారు. గతంలో మాదిరిగానే వ్యాపారులకు దుకాణాలు ఉండే విధంగా కృషి చేస్తామని ఆలేరు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆయన వెంట మున్సిపల్ కౌన్సిలర్లు ముక్కెర్ల మల్లేష్ యాదవ్, బూడిద మధు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బందారపు భిక్షపతి, కాంగ్రెస్ నేతలు గుండ్లపల్లి భరత్‌గౌడ్, పెలిమెల్లి శ్రీధర్, ఎరుకల హేమేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# టెక్స్‌టైల్ హబ్‌గా వరంగల్..



- **మే 10న కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును ప్రారంభించనున్న ప్రధాని మోడీ**
- **దేశంలోనే అతిపెద్ద టెక్స్‌టైల్ పార్క్**

**జయభేరి, వరంగల్ :**

తెలంగాణ పారిశ్రామిక రంగంలో మరో చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతం కాబోతోంది. అంతర్జాతీయ స్థాయి వసతులతో వరంగల్‌లో నిర్మించిన 'కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్' (KMTP) ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. దేశ వస్త్ర పరిశ్రమ రంగానికి సరికొత్త ఊతమిచ్చే ఈ మెగా ప్రాజెక్టును మే 10వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్నారు.

మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తెలంగాణ పర్యటనకు విచ్చేస్తున్న ఆయన, ఈ పీఎం మిత్ర పార్కును జాతికి అంకితం చేయనున్నారు.

**దేశంలోనే అతిపెద్ద టెక్స్‌టైల్ పార్క్**

సుమారు 1,327 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో నిర్మితమైన ఈ పార్క్, దేశంలోనే అతిపెద్ద టెక్స్‌టైల్ పార్కుగా గుర్తింపు పొందింది. ప్రధానమంత్రి మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ రీజియన్ అండ్ అప్పారెల్ (పీఎం మిత్ర) పథకం కింద దీనిని బ్రౌన్ ఫీల్డ్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఈ పార్కును దాదాపు రూ. 1,695.54 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేశారు.

**భారీగా పెట్టుబడులు, ఉపాధి**

ఈ మెగా ప్రాజెక్టు ద్వారా వరంగల్ ప్రాంతానికి సుమారు రూ. 6,000 కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేయగా, ఇప్పటికే రూ. 3,800 కోట్లకు పైగా పెట్టుబడులు రావడం గమనార్హం.

ఈ పార్క్ అందుబాటులోకి రావడం వల్ల వేలాది మంది స్థానిక యువతకు, ముఖ్యంగా నేత కార్మికులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. వస్త్ర ఉత్పత్తి మరియు ఎగుమతులు పెరగడం ద్వారా వరంగల్ నగరం గ్లోబల్ టెక్స్‌టైల్ మ్యాప్‌లో ప్రత్యేక గుర్తింపును పొందనుంది.

**ప్రధాని మోడీ '5F' విజన్**

ప్రధాని నరేంద్ర మోడీ ప్రతిపాదించిన '5F' విజన్ (ఫామ్ టు ఫైబర్, ఫైబర్ టు ఫ్యాక్టరీ, ఫ్యాక్టరీ టు ఫ్యాషన్, ఫ్యాషన్ టు ఫారిన్) ఈ పార్కులో ప్రతిబింబించనుంది. అంటే పత్తి సాగు చేసే రైతు నుంచి విదేశాలకు దుస్తుల ఎగుమతి వరకు అన్ని ప్రక్రియలు ఒకే చోట అనుసంధానం కానున్నాయి. దీనివల్ల రవాణా ఖర్చులు తగ్గడమే కాకుండా, అంతర్జాతీయ మార్కెట్‌లో భారతీయ వస్త్రాలకు డిమాండ్ పెరుగుతుంది.

**కిషన్ రెడ్డి ప్రకటన**

వరంగల్ టెక్స్‌టైల్ పార్క్ ప్రారంభోత్సవ వివరాలను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి శనివారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' (X) వేదికగా వెల్లడించారు. ఈ ప్రాజెక్టు తెలంగాణ పారిశ్రామికాభివృద్ధికి మణిహారంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ పార్క్ ప్రారంభంతో వరంగల్ కేవలం చారిత్రక నగరంగానే కాకుండా, ఆధునిక పారిశ్రామిక హబ్‌గా కూడా విరాజిల్లబోతోంది. స్థానిక రైతులు పండించే పత్తికి మద్దతు ధర లభించడంతో పాటు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఇది పెద్ద ఎత్తున తోడ్పాటును అందించనుంది.

# వయసు 29.. ఆస్తులు మాత్రం 100కోట్లకు పైగా..




బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్.. అందాల తార శ్రీదేవి కూతురు జాన్వీ కపూర్ హీరోయిన్ గా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. తొలి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకుంది. ఆతర్వాత వరుసగా సినిమాలు చేసినప్పటికీ హిట్స్ కంటే ఫ్లాపులే ఎక్కువగా ఉన్నాయి. కమర్షియల్ సినిమాలతో పాటు లేడీ ఓరియెంటెడ్ సినిమాలు చేస్తూ మెప్పించింది ఈ భామ. నటనతో పాటు గ్లామర్ పరంగానూ ఈ ముద్దుగుమ్మ ఆకట్టుకుంటుంది. మొన్నటివరకు బాలీవుడ్ లో సినిమాలు చేసిన ఈ చిన్నది.. ఇప్పుడు టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. తెలుగులో మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ తో కలిసి దేవర సినిమాతో పరిచయం అయ్యింది ఈ ముద్దుగుమ్మ. తొలి సినిమాతోనే తెలుగులో భారీ హిట్ అందుకుంది ఈ చిన్నది. ఇక ఇప్పుడు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న పెద్ది సినిమాలో హీరోయిన్ గా చేస్తుంది ఈ అమ్మడు. ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాలో పల్లెటూరి యువతిగా కనిపించనుంది జాన్వీ కపూర్. జాన్వీ ఇండస్ట్రీకి వచ్చి 9ఏళ్లు అవుతుంది. కాగా ఈ అమ్మడి ఆస్తిపాస్తులు వంద కోట్లకు పైనే అని తెలుస్తుంది. అలాగే రెమ్యునరేషన్ కూడా గట్టిగానే తీసుకుంటుంది ఈ చిన్నది. దేవర సినిమాకు 5 కోట్లు, పెద్ది కోసం 7 కోట్లు తీసుకుందని తెలుస్తుంది.



# గోపీచంద్ యాక్షన్ షురూ


హీరో టి.గోపీచంద్ కథానాయకుడిగా 70ఎంఎం ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఫైట్ మాస్టర్ వి.వెంకట్ దర్శకునిగా పరిచయమవుతున్నారు. మలయాళ నటి అనార్కలి నాజర్ కథానాయిక. ఈ చిత్రం ప్రారంభోత్సవం ఆదివారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి యాక్షన్ కొరియోగ్రాఫర్లు రామ్‌లక్ష్మణ్ కెమెరా స్విచాన్ చేయగా, అగ్ర నిర్మాత శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి క్లాప్ కొట్టారు. మరో అగ్ర నిర్మాత దిల్‌రాజు గౌరవ దర్శకత్వం వహించారు. దర్శకుడు శివ నిర్వాణ, నిర్మాతలు కేఎల్ దామోదరప్రసాద్, మైత్రీ రవిశంకర్ స్క్రిప్ట్‌ని మేకర్స్‌కి అందించారు. అతిథులంతా చిత్రం బాగా రావాలంటూ ఆకాంక్షించారు. గోపీచంద్ కెరీర్‌లో ఇది 34వ చిత్రమని, అత్యున్నత నిర్మాణ విలువలతో, సాంకేతిక నైపుణ్యంతో కూడిన సరికొత్త కథను ప్రేక్షకులకు అందించనున్నామని, దర్శకుడు వి.వెంకట్ బలమైన స్క్రిప్ట్‌ని సిద్ధం చేశారని, గోపీచంద్ పూర్తి యాక్షన్ అవతారంలో కనిపిస్తారని, ఇంటెన్స్ డ్రామా, ఎమోషన్స్‌తో ఆయన పాత్ర సాగుతుందని, రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే మొదలుకానున్నదని మేకర్స్ తెలిపారు. ఈచిత్రానికి కెమెరా: షామ్‌దత్, సంగీతం: సామ్ సీఎస్, ఎడిటింగ్: శ్రీకర ప్రసాద్.

# రాకాలో అక్షయ్‌కుమార్?



దేశంలో తెరకెక్కుతున్న మోస్ట్ ఎవైటెడ్ పానిండియా చిత్రాల్లో అల్లు అర్జున్ నటిస్తున్న 'రాకా' ఒకటి. అట్లీ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ ఈ పానిండియా చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. మాఫియా నేపథ్యంలో సాగే ఈ సైంటిఫిక్ థ్రిల్లర్‌లో దీపికా పదుకోన్ కథానాయిక. రష్మిక మందన్నా, జాన్వీకపూర్, మృణాళ్ ఠాకూర్ కీలకపాత్రధారులు. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం బాలీవుడ్ సూపర్‌స్టార్ అక్షయ్‌కుమార్ ఈ సినిమాలో ఓ ప్రత్యేకపాత్ర చేసేందుకు అంగీకారం తెలిపినట్టు తెలిసింది. వచ్చే షెడ్యూల్ నుంచి ఆయన ఈ సినిమా సెట్స్‌లోకి ఎంట్రీ ఇస్తారట. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన రావాల్సివుంది.

# పెద్ది ట్రైలర్ రిలీజ్ డేట్ ఫిక్స్..




మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ అభిమానులకు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న భారీ అప్‌డేట్ వచ్చేసింది. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' చివరకు విడుదల తేదీని ఖరారు చేసుకుంది. పలుమార్లు వాయిదా పడుతూ వచ్చిన ఈ పాన్ ఇండియా చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ఐదు భాషల్లో ఘనంగా విడుదల కానుంది.ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్న నేపథ్యంలో మేకర్స్ కూడా విడుదలను భారీ స్థాయిలో ప్లాన్ చేస్తున్నారు. ముఖ్యంగా నార్త్ అమెరికాలో ఈ చిత్రానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. అక్కడ వరల్డ్ ఫస్ట్ షో భారత కాలమానం ప్రకారం జూన్ 3 రాత్రి 9 గంటలకు ప్రదర్శించనున్నారు. దీనితో విదేశాల్లో ఉన్న తెలుగు ప్రేక్షకులు ముందుగానే ఈ సినిమా ఎంజాయ్ చేసే అవకాశం పొందుతున్నారు. ఇక ఈ సినిమాకు సంబంధించిన అడ్వాన్స్ బుకింగ్స్ మే 7 నుంచి ప్రారంభం కానున్నాయి. రామ్ చరణ్‌కు ఉన్న గ్లోబల్ క్రేజ్ దృష్ట్యా ప్రీమియర్ షోలకే భారీగా టికెట్లు అమ్ముడవుతాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా యూఎస్ మార్కెట్‌లో ఈ చిత్రం రికార్డు స్థాయి ఓపెనింగ్స్ సాధించే అవకాశం ఉందని భావిస్తున్నారు. లేటెస్ట్ బజ్ ప్రకారం పెద్ది ట్రైలర్ ఈ మే 17 లేదా 18న రిలీజ్ చేయబోతున్నట్టు తెలుస్తుంది. ట్రైలర్ రిలీజ్ తర్వాత ఇక మూవీ ప్రమోషన్స్ వేగం పెంచుతారు. మధ్య మధ్యలో మూవీకి సంబంధించిన పాటలు, గ్లింప్స్ వదులుతూ సినిమాపై మరింత ఆసక్తి పెంచేలా ప్లాన్ చేస్తున్నారు.

పెద్ది సినిమాకి వృద్ధి సినిమాస్ నిర్మాణం వహిస్తుండగా పాన్ ఇండియా లెవెల్లో చాలా గ్రాండ్ రిలీజ్ ని ఈ సినిమాకి ప్లాన్ చేస్తున్నారు.ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తోంది. అలాగే శివ రాజ్‌కుమార్, బొమన్ ఇరానీ, దివ్యేందు శర్మ, జగపతి బాబు వంటి ప్రముఖులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ స్టార్ కాస్టింగ్ సినిమాపై మరింత హైప్‌ను పెంచుతోంది.మరో ముఖ్య ఆకర్షణగా నిలిచేది సంగీతం. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నాడు. ఆయన మ్యూజిక్ ఈ సినిమాకు ప్రత్యేకమైన హైలైట్‌గా నిలుస్తుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌తో భావోద్వేగాలు, యాక్షన్, మాస్ ఎలిమెంట్స్ కలగలిపి రూపొందుతున్న 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయం సాధిస్తుందా అనే ఆసక్తి అందరిలో ఉంది.



# ఈ బ్యూటీకి బ్రేకప్ అయ్యిందా.?

ప్రేమలో విఫలమైనప్పుడు ఆ బాధ నుండి బయటపడటం ప్రతి ఒక్కరికీ ఒక పెద్ద సవాలుతో కూడుకున్న విషయమే. దీనికి ఎలాంటి నిర్దిష్టమైన సూత్రాలు లేవు. అయితే తాజాగా బాలీవుడ్ చిత్ర పరిశ్రమకు చెందిన ఒక యువ కథానాయిక తాను ఎదుర్కొన్న బ్రేకప్ బాధల గురించి, ఆ హార్ట్ బ్రేక్ నుండి ఎలా కోలుకుందో ఒక ఇంటర్వ్యూలో మనసు విప్పి మాట్లాడింది. సదరు బాలీవుడ్ నటి ఇటీవల జరిగిన ఒక సదస్సులో మాట్లాడుతూ తన హార్ట్ బ్రేక్ అనుభవాలను పంచుకుంది. "ప్రేమలో విఫలమైనప్పుడు నేను బాగా ఏడుస్తాను, ఐస్ క్రీమ్ తింటాను. అరిజిత్ సింగ్ పాడిన విషాదకరమైన పాటలు వింటాను. ఆ తర్వాత కొద్దిసేపటికి ఆ బాధను మర్చిపోతాను" అంటూ చాలా సరదాగా సమాధానం ఇచ్చింది. సాధారణ యువతుల తరహాలోనే తాను కూడా బ్రేకప్ బాధను అనుభవిస్తానని తెలిపింది. బంధాల కోసం మనం ఎప్పుడూ మన వ్యక్తిత్వాన్ని కోల్పోకూడదు" అని చాలా పరిణతితో కూడిన వ్యాఖ్యలు చేసింది. తనకంటూ ఒక సొంత స్థలాన్ని ఏర్పరచుకున్న తర్వాతే ప్రేమ, బంధాలపై తనకు సరైన అవగాహన వచ్చిందని వెల్లడించింది. ఈ యువ నటి గతంలో బాలీవుడ్ హీరో ఆదిత్య రాయ్ కపూర్‌తో ప్రేమలో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. వీరిద్దరూ దాదాపు రెండేళ్ల పాటు డేటింగ్ చేసిన తర్వాత పరస్పర అంగీకారంతోనే విడిపోయినట్లు సమాచారం. ఆ తర్వాత ఇటీవల కాలంలో వాకర్ బ్లాంకో అనే మాజీ మోడల్‌తో ఆమె ప్రేమలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ డేటింగ్ వార్తలపై అటు నటి కానీ, ఇటు మోడల్ కానీ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. ఏదేమైనా తన వ్యక్తిగత విషయాలను చాలా నిజాయితీగా పంచుకుంటూ ఈ బ్యూటీ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**